SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/26/A3949

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

**7036644111, 9490140565**

సంపుటి: 1 | సంచిక: 104 | ఎడిటర్ : అలీ ముర్తుజా | ఆదివారం 25 అక్టోబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |



## జామియాలో ఉద్రిక్తత!

- విద్యార్థి సంఘం పునరుద్ధరణ కోసం ఆమరణ నిరాహార దీక్షలు
- నిరసన టెంట్ల తొలగింపు ప్రయత్నంతో భద్రతా సిబ్బందితో ఘర్షణ
- 2006 నుంచి నిలిచిపోయిన విద్యార్థి సంఘం ఎన్నికలు
- క్యాంపస్‌లోకి ప్రవేశించిన కాంగ్రెస్ ఎంపీలపై రిజిస్ట్రార్ ఆరోపణలు

4

# అల్లూరి జిల్లాలో పేలుడు బీభత్సం

- జిలెటిన్ స్టిక్స్ పేలి ఘోర విషాదం
- మృతుల్లో పాఠశాల టీచర్ సునీత
- డీజిల్ నింపుతుండగా మంటలు చెలరేగి భారీ పేలుడు
- ఛిద్రమైన మృతదేహాలు
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన డిప్యూటీ సీఎం, హోంమంత్రి

3

## ఏడుగురి దుర్మరణం

అల్లూరి సీతారామరాజు జిల్లాలో శనివారం ఉదయం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. అనంతగిరి మండలం పినకోట పంచాయతీ పరిధిలోని పీచుమామిడి గ్రామ సమీపంలో జిలెటిన్ స్టిక్స్ పేలి ఆరుగురు మృతి చెందినట్లు ప్రాథమిక సమాచారం. మృతుల్లో ఓ పాఠశాల ఉపాధ్యాయురాలు కూడా ఉండటం తీవ్ర విషాదాన్ని నింపింది.







## వస్తోంది తుపాను కాదు.. తీవ్ర తుపాను

### ఏపీకి ఐఎండీ హెచ్చరిక

### బంగాళాఖాతంలో వాయుగుండం..

### అతి తీవ్ర తుపానుగా మారే సూచన

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారింది. ఇది వేగంగా బలపడుతూ ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తోంది. ఇది రానున్న కొద్ది రోజుల్లో 'అతి తీవ్ర తుపాను'గా మారి రాష్ట్రంపై పెను ప్రభావం చూపనుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. అక్టోబర్ 28న బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, యానాం తీర ప్రాంతాలకు 'ప్రీ-సైక్లోన్ వాచ్' జారీ చేసింది.

2

# ఏపీకి కేంద్రం వరాలు

### సెమీకండక్టర్, కృత్రిమ మేధ రంగాల అభివృద్ధికి కేంద్రం అండ

- రైల్వేకు రూ.10 వేల కోట్ల ప్రాజెక్టులు
- అమరావతి-విశాఖ మధ్య హైస్పీడ్ రైలు కారిడార్‌కు చంద్రబాబు విజ్ఞప్తి
- తొమ్మిది పోర్టులకు రైల్వే అనుసంధానం.. రెండు భారీ కోచింగ్ టెర్మినళ్లు
- విశాఖ-బెంగళూరు మధ్య స్లీపర్ వందేభారత్‌కు కేంద్ర మంత్రి సానుకూలత
- ఢిల్లీలో అమిత్ షా, అశ్వినీ వైష్ణవ్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ



**అమరావతి, అక్టోబర్ 24 (సమయం న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణతోపాటు సెమీకండక్టర్, కృత్రిమ మేధ రంగాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందించనుంది. రాష్ట్రంలో దాదాపు రూ.10 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టుల ప్రతిపాదనలపై కేంద్రం సానుకూలంగా స్పందించింది. ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక

వివరాలు 2 లో

## అప్రమత్తంగా ఉండాలి!

- మంగళ, బుధవారాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలకు అవకాశం
- తీరప్రాంతాల్లో బలమైన ఈదురుగాలులు వీచే సూచనలు
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా చర్యలు చేపట్టాలి
- లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలి
- తుపాను హెచ్చరికలపై సీఎం చంద్రబాబు సమీక్ష



వివరాలు 2వ పేజీలో

## చంద్రబాబు చేతిలో కీలుబొమ్మలా ఎస్ఈసీ

- ప్రభుత్వం, ఎస్ఈసీ, పోలీసులు కుమ్మక్కై ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారు
- మాజీ మంత్రి అంబటి రాంబాబు ధ్వజం

3





మహిళలపై నేరాల కేసులు

## దేశంలోనే ఏపీకి రెండో స్థానం

ఏడీఆర్ నివేదిక!

2

### సమాధానం చెప్పే దమ్ములేక

## జగన్‌పై వ్యక్తిగత దాడి

- ఫేక్ ప్రచారంతో నిజాలను చెరిపేయలేరు
- సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టీకరణ

వివరాలు 3లో..





ట్రంప్ నోట మళ్లీ

## అదే పాట!

భారత్-పాక్ యుద్ధాన్ని తానే ఆపానంటూ ప్రకటన

4

## భోగాపురం నుంచి ఢిల్లీకి డైరెక్ట్ ఫ్లైయిట్..



- నేటి నుంచే భోగాపురం విమానాశ్రయం నుంచి సర్వీసులు ప్రారంభం
- ఉత్తరాంధ్ర నుంచి దేశ రాజధానికి ఇదే తొలి డైరెక్ట్ విమాన సేవ
- ఆకాశ ఎయిర్‌లైన్స్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి అందుబాటులోకి రానున్న సర్వీసులు
- ఉదయం 8:30 గంటలకు భోగాపురం నుంచి ఢిల్లీకి విమానం తిరుగు ప్రయాణం

4

ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరబోతోంది. భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దేశ రాజధాని ఢిల్లీకి తొలిసారిగా నేరుగా విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి. ప్రముఖ విమానయాన సంస్థ ఆకాశ ఎయిర్‌లైన్స్ ఈ సర్వీసులను ఆదివారం (అక్టోబర్ 25) నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురానుంది.

## మేనకోడలి పెళ్లికి నా ఇల్లు వద్దు!

- చెల్లెలు షర్మిలకు జగన్ లేఖ.. బయటపెట్టిన వైసీపీ
- బెంగళూరు నివాసంలో వివాహ వేడుకకు అభ్యంతరం
- భద్రత, వ్యక్తిగత గోప్యత సమస్యలే కారణమంటూ వివరణ
- ప్రత్యామ్నాయంగా హైదరాబాద్ లోటస్‌పాండ్‌ను పరిశీలించాలని సూచన

2





# మేనకోడలి పెళ్లికి నా ఇల్లు వద్దు

**చెల్లెలు షర్మిలకు జగన్ లేఖ.. బయటపెట్టిన వైసీపీ**

**బెంగళూరు నివాసంలో వివాహ వేడుకకు అభ్యంతరం**

**భద్రత, వ్యక్తిగత గోప్యత సమస్యలే కారణమంటూ వివరణ**

**ప్రత్యామ్నాయంగా హైదరాబాద్ లోటస్‌పాండ్‌ను పరిశీలించాలని సూచన**

**అమరావతి, అక్టోబర్ 24 (సమయం న్యూస్):** వైఎస్సార్ కుటుంబంలో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. తన మేనకోడలు అంజలి వివాహాన్ని బెంగళూరులోని తన నివాసంలో నిర్వహించవద్దని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సోదరి వైఎస్ షర్మిలకు స్పష్టం చేశారు. ఈ మేరకు అక్టోబర్ 9న షర్మిలకు రాసిన లేఖను వైసీపీ తాజాగా బయటపెట్టింది. వివాహ వేడుకకు తన బెంగళూరు నివాసాన్ని వేదికగా ఎంచుకోవడంపై జగన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. భద్రతాపరమైన సమస్యలు, కుటుంబ సభ్యుల వ్యక్తిగత గోప్యతను దృష్టిలో ఉంచుకొని మరో వేదికను ఎంపిక చేసుకోవాలని సూచించారు. మేనకోడలు అంజలి వివాహం జరగనుండటం పట్ల లేఖలో జగన్ సంతోషం వ్యక్తం చేశారు. అయితే ఈ వేడుకను బెంగళూరులోని తన నివాసంలో నిర్వహించాలని షర్మిల కుటుంబం భావిస్తున్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. పెద్దఎత్తున వివాహ కార్యక్రమం నిర్వహిస్తే తీవ్రమైన భద్రతాపరమైన సమస్యలు తలెత్తే అవకాశముందని వివరించారు. బెంగళూరులోని ఇల్లు తన కుటుంబ నివాసమని, అక్కడ కుటుంబ సభ్యుల భద్రత, వ్యక్తిగత గోప్యతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. తన సొంత పిల్లల వివాహం విషయంలోనూ ఇలాంటి పరిస్థితులు ఎదురైతే ఇదే నిర్ణయం తీసుకుంటానని లేఖలో పేర్కొన్నారు. వివాహ వేదిక విషయంలో తనకున్న ఇబ్బందులను ఇప్పటికే కొందరి ద్వారా తెలియజేసినప్పటికీ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకపోవడం బాధ కలిగించిందని జగన్ పేర్కొన్నారు. తన పరిస్థితిని అర్థం చేసుకొని బెంగళూరు నివాసానికి బదులుగా మరో వేదికను ఎంపిక చేసుకోవాలని షర్మిలను కోరారు. అవసరమైతే హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్ నివాసంలో వివాహ వేడుక నిర్వహించుకునే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. అంజలి వివాహ ఏర్పాట్లపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో తన వైఖరిని స్పష్టం చేసేందుకే జగన్ రాసిన లేఖను వైసీపీ బహిర్గతం చేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ లేఖపై షర్మిల స్పందన ఏమిటన్నది తెలియాల్సి ఉంది.

# మహిళలపై నేరాల కేసులు.. దేశంలోనే ఏపీకి రెండో స్థానం

**జాబితాలో బీజేపీ టాప్, టీడీపీకి మూడో స్థానం : ఏడీఆర్ నివేదిక!**

**నేరచరిత ఉన్నవారిని అనర్హులుగా ప్రకటించాలన్న ఏడీఆర్**

**అమరావతి, అక్టోబర్ 24 (సమయం న్యూస్):** చట్టసభల్లో మహిళల రక్షణ గురించి మాట్లాడాల్సిన ప్రజాప్రతినిధులే వారిపై వేధింపుల కేసుల్లో నిందితులుగా ఉన్నారన్న విషయాన్ని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) నివేదిక వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఉన్న సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేల ఎన్నికల అఫిడవిట్లను విశ్లేషించి విడుదల చేసిన నివేదిక ప్రకారం, మొత్తం 187 మంది ప్రజాప్రతినిధులపై మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులు నమోదయ్యాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్ 22 మంది ప్రజాప్రతినిధులతో (21 మంది ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ) దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. ఏడీఆర్ నివేదిక ఆధారంగా 19 మంది ఎంపీలు, 168 మంది ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు ఉండగా, 14 మందిపై నేరుగా ఐపీసీ సెక్షన్ 376 కింద అత్యాచారం కేసులు నమోదయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వంలోని నలుగురు మంత్రులపై కూడా కేసులు ఉన్నట్లు నివేదిక పేర్కొంది. తెలంగాణలో ముగ్గురు ఎంపీలు, ఇద్దరు ఎమ్మెల్యేలతో సహా ఐదుగురిపై కేసులు ఉన్నాయి. పార్టీల వారీగా బీజేపీకి చెందిన 106 మంది ఈ జాబితాలో మొదటి స్థానంలో ఉండగా, కాంగ్రెస్ నుంచి 20 మంది, తెలుగుదేశం పార్టీ (టీడీపీ) నుంచి 18 మంది మూడో స్థానంలో నిలిచారు. రాష్ట్రాల పరంగా పశ్చిమ బెంగాల్ (69) ప్రథమ స్థానంలో నిలవగా, ఆంధ్రప్రదేశ్ (22) ద్వితీయ స్థానంలో, ఒడిశా (17) తృతీయ స్థానంలో ఉన్నాయి. మహిళలపై అఘాయిత్యాల ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి టికెట్లు ఇవ్వడాన్ని ఏడీఆర్ తప్పుబట్టింది. నేరచరిత్ర ఉన్నవారిని శాశ్వతంగా అనర్హులుగా ప్రకటించాలని, ఫాస్ట్-ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ వేగవంతం చేయాలని డిమాండ్ చేసింది.



# అల్లూరి జిల్లాలో పేలుడు బీభత్సం

- ఏడుగురి దుర్మరణం
- జిలెటిన్ స్టిక్స్ పేలి ఘోర విషాదం
- మృతుల్లో పాఠశాల టీచర్ సునీత
- డీజిల్ నింపుతుండగా మంటలు చెలరేగి భారీ పేలుడు
- గుర్తుపట్టలేనంతగా ఛిద్రమైన మృతదేహాలు
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన డిప్యూటీ సీఎం, హోంమంత్రి





**పాడేరు/అనంతగిరి, అక్టోబర్ 24 (సమయం న్యూస్):** అల్లూరి సీతారామరాజు జిల్లాలో శనివారం ఉదయం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. అనంతగిరి మండలం పినకోట పంచాయతీ పరిధిలోని పీచుమామిడి గ్రామ సమీపంలో జిలెటిన్ స్టిక్స్ పేలి ఆరుగురు మృతి చెందినట్లు ప్రాథమిక సమాచారం. మృతుల్లో ఓ పాఠశాల ఉపాధ్యాయురాలు కూడా ఉండటం తీవ్ర విషాదాన్ని నింపింది. పేలుడు తీవ్రతకు మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా ఛిద్రమయ్యాయి. రెండు వాహనాలు మంటల్లో చిక్కుకోవడంతో ప్రమాద స్థలంలో భయానక పరిస్థితులు నెలకొన్నాయి. పీచుమామిడి గ్రామ పరిధిలో బడిబాట రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కొండను తొలిచేందుకు అవసరమైన జిలెటిన్ స్టిక్స్‌ను బొలెరో పికప్ వాహనంలో నిర్మాణ ప్రాంతానికి తరలిస్తున్నారు. ఈ క్రమంలో గుమ్మంతి గ్రామ సమీపంలో టిప్పర్ వాహనం నుంచి బొలెరోలో డీజిల్ నింపుతుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు స్థానికులు తెలిపారు. మంటలు జిలెటిన్ స్టిక్స్‌కు వ్యాపించడంతో భారీ పేలుడు సంభవించినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. పేలుడు ధాటికి వాహనాల్లో ఉన్నవారు తీవ్రంగా గాయపడగా, కొందరు అక్కడికక్కడే మృతి చెందారు. బొలెరో క్యాబిన్‌లో ఉన్నవారు మంటల్లో చిక్కుకున్నట్లు సమాచారం. ఉదయం సుమారు 8.30 గంటల సమయంలో భారీ పేలుడు శబ్దం వినిపించడంతో సమీప గ్రామాల ప్రజలు ఉలిక్కిపడ్డారు. సంఘటనా స్థలానికి పరుగులు తీసిన స్థానికులకు రెండు వాహనాలు మంటల్లో కనిపించాయి. వెంటనే పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడినవారిని మెరుగైన వైద్యం కోసం తరలించారు. పేలుడు తీవ్రతకు మృతదేహాలు ఛిద్రమవడంతో గుర్తింపు ప్రక్రియ కష్టంగా మారినట్లు సమాచారం. ప్రమాదంలో విశాఖపట్నానికి చెందిన ఉపాధ్యాయురాలు జె.సునీత మృతి చెందడం తీవ్ర విషాదాన్ని కలిగించింది. పినకోట పంచాయతీ పరిధిలోని మద్రెబు పాఠశాలలో పనిచేస్తున్న ఆమె శనివారం విధులకు హాజరయ్యేందుకు బయలుదేరారు. దేవరపల్లి నుంచి బొలెరో పికప్ వాహనంలో ప్రయాణిస్తున్న సమయంలో పేలుడు సంభవించడంతో ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. మృతుల్లో అస్సాంకు చెందిన సహాయకుడు నాసీరుద్దీన్, బీహార్‌కు చెందిన ఆపరేటర్ టింకు, అనకాపల్లి జిల్లా చీడికాడకు చెందిన రహదారి పనుల పర్యవేక్షకుడు నారాయణ, కడపకు చెందిన బొలెరో డ్రైవర్ పవన్ కుమార్, అనకాపల్లి జిల్లా దేవరపల్లికి చెందిన మణి, కడపకు చెందిన టిప్పర్ డ్రైవర్ ప్రవీణ్ పేర్లు కూడా ప్రాథమిక వివరాల్లో వెల్లడయ్యాయి. అయితే ఆరుగురు మృతి చెందినట్లు పేర్కొంటున్నప్పటికీ ఏడుగురి పేర్లు వెలుగులోకి రావడంతో అధికారికంగా మృతుల సంఖ్య, గుర్తింపుపై స్పష్టత రావాల్సి ఉంది.

**పవన్ కల్యాణ్, అనిత దిగ్భ్రాంతి**

ఈ ఘోర ప్రమాదంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అల్లూరి జిల్లా కలెక్టర్ టి.నిశాంతి నుంచి ఘటన వివరాలు తెలుసుకున్నట్లు సమాచారం. బాధితులకు తక్షణ సహాయం అందించాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు కల్పించాలని పోలీసు, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు అనంతగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రత్యక్ష సాక్షుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. జిలెటిన్ స్టిక్స్ రవాణా, డీజిల్ నింపే సమయంలో తీసుకున్న భద్రతా చర్యలు, పేలుడుకు దారితీసిన కారణాలపై విచారణ కొనసాగుతోంది. ఈ దుర్ఘటనతో మద్రెబు, పీచుమామిడి, గుమ్మంతి సహా పరిసర గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

# ఏపీకి కేంద్రం భారీ వరాలు



(మొదటి పేజీ తరువాయి..)

అంశాలపై చర్చించారు. అనంతరం కేంద్ర రైల్వే, సమాచార సాంకేతిక శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమై రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులు, కొత్త రైల్వే మార్గాలు, సెమీకండక్టర్ పరిశ్రమలు, కృత్రిమ మేధ మౌలిక సదుపాయాల అభివృద్ధిపై చర్చించారు. రాష్ట్రాన్ని సెమీకండక్టర్ డిజైన్ రంగంలో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు కేంద్రం సహకరిస్తుందని అశ్వినీ వైష్ణవ్ హామీ ఇచ్చారు. రాష్ట్రంలో రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణకు సంబంధించి ముఖ్యమంత్రి పలు కీలక ప్రతిపాదనలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. విజయవాడ బైపాస్ నిర్మాణానికి రూ.3,197 కోట్లు, కొవ్వూరు-భద్రాచలం రైల్వే ప్రాజెక్టుకు రూ.2,860 కోట్లు, ఒంగోలు-దొనకొండ రైల్వే మార్గానికి రూ.1,800 కోట్లు, అనకాపల్లి--కొత్తవలస బైపాస్ నిర్మాణానికి రూ.2,190 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వివరించారు. ఈ నాలుగు ప్రాజెక్టుల మొత్తం అంచనా వ్యయం రూ.10,047 కోట్లుగా ఉంది. వీటికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలను త్వరగా ఆమోదించి నిధులు మంజూరు చేయాలని కోరారు. విజయవాడ బైపాస్‌లో భాగంగా కృష్ణా నదిపై రెండు కొత్త రైల్వే వంతెనలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. కొవ్వూరు-భద్రాచలం రైల్వే ప్రాజెక్టును వ్యయ భాగస్వామ్య పద్ధతిలో చేపట్టాలని ప్రతిపాదించారు. రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి విశాఖపట్నం వరకు హైస్పీడ్ రైలు కారిడార్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రాన్ని కోరారు. విజయవాడ--ఇటార్సీ, ఖరగ్‌పూర్--విజయవాడ రైల్వే మార్గాల్లో సామర్థ్యం పెంచేందుకు నాలుగు లైన్ల నిర్మాణ పనులను రెండేళ్లలో పూర్తి చేయాలని సూచించారు. విశాఖపట్నం, అమరావతిలో రెండు భారీ కోచింగ్ టెర్మినళ్ల ఏర్పాటుకు ఇప్పటికే అంగీకారం లభించినట్లు వెల్లడించారు. రైల్వే ప్రభుత్వ రంగ సంస్థల కార్యాలయాలను అమరావతిలో ఏర్పాటు చేసే అంశంపైనా చర్చించారు. రాష్ట్రంలోని తొమ్మిది పోర్టులకు రైల్వే అనుసంధానం కల్పించి సరకు రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలని కోరగా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. విశాఖపట్నం నుంచి తిరుపతి మీదుగా బెంగళూరుకు స్లీపర్ వందేభారత్ రైలును నడపాలని ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. దీనికి కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ అంగీకారం తెలిపినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. అలాగే విశాఖపట్నం--తిరుపతి మధ్య పగటిపూట ప్రయాణించేలా సీటింగ్ సౌకర్యంతో మరో రైలును ప్రవేశపెట్టేందుకు కూడా సానుకూలత వ్యక్తం చేశారు. ఈ రైళ్లు అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల మధ్య రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌ను సెమీకండక్టర్ డిజైన్, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు కేంద్ర సహకారం అవసరమని చంద్రబాబు వివరించారు. పరిశోధన కేంద్రాలు, నైపుణ్య శిక్షణ సంస్థలు, ఆధునిక సాంకేతిక మౌలిక సదుపాయాల ఏర్పాటుకు మద్దతు ఇవ్వాలని కోరారు. సెమీకండక్టర్ డిజైన్, పరిశోధన, అభివృద్ధితోపాటు యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ సహకరిస్తుందని అశ్వినీ వైష్ణవ్ హామీ ఇచ్చారు. కృత్రిమ మేధ రంగంలో అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూడా కేంద్రం అండగా నిలుస్తుందని తెలిపారు. రైల్వే ప్రాజెక్టుల వేగవంతమైన అమలు, ఆధునిక సాంకేతిక పరిశ్రమల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలను పెంచడమే లక్ష్యంగా కేంద్రంతో సమన్వయం కొనసాగించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు.

# కోస్తాంధ్రకు తుపాను ముప్పు.. అప్రమత్తంగా ఉండాలి!

- మంగళ, బుధవారాల్లో భారీ వర్షాలకు అవకాశం
- తీరప్రాంతాల్లో బలమైన ఈదురుగాలులు
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా చర్యలు
- తుపాను హెచ్చరికలపై సీఎం చంద్రబాబు సమీక్ష

**అమరావతి, అక్టోబర్ 24 (సమయం న్యూస్):** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా బలపడే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. తుపాను హెచ్చరికలపై సీఎం చంద్రబాబు నాయుడు శనివారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, రియల్‌టైమ్ గవర్నెన్స్ సొసైటీ అధికారులతో తుపాను పరిస్థితులు, వర్షాల ప్రభావం, ముందస్తు జాగ్రత్తలపై చర్చించారు. ప్రజలకు సకాలంలో హెచ్చరికలు అందించడంతోపాటు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తూర్పుమధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం మరింత బలపడి తుపానుగా మారే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీని ప్రభావంతో మంగళ, బుధవారాల్లో కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. తీరప్రాంతాల్లో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉన్నందున ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా హెచ్చరికలు జారీ చేయాలని, ఇప్పటికే సముద్రంలో ఉన్నవారికి అవసరమైన సమాచారాన్ని చేరవేయాలని అధికారులను ఆదేశించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని లోతట్టు కాలనీలు, ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు రెవెన్యూ, పోలీసు, విపత్తు నిర్వహణ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అత్యవసర సహాయం, సమాచారం కోసం ప్రజలు సంప్రదించేందుకు టోల్‌ఫ్రీ నంబర్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తూ తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని చంద్రబాబు స్పష్టం చేశారు.

# భోగాపురం నుంచి ఢిల్లీకి డైరెక్ట్ ఫ్లయిట్..

- నేటి నుంచే భోగాపురం విమానాశ్రయం నుంచి సర్వీసులు ప్రారంభం
- ఉత్తరాంధ్ర నుంచి దేశ రాజధానికి ఇదే తొలి డైరెక్ట్ విమాన సేవ
- ఆకాశ ఎయిర్‌లైన్స్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి అందుబాటులోకి రానున్న సర్వీసులు
- ఉదయం 8:30 గంటలకు భోగాపురం నుంచి ఢిల్లీకి విమానం తిరుగు ప్రయాణం

**భోగాపురం, అక్టోబర్ 24 (సమయం న్యూస్):** ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరబోతోంది. భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దేశ రాజధాని ఢిల్లీకి తొలిసారిగా నేరుగా విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి. ప్రముఖ విమానయాన సంస్థ ఆకాశ ఎయిర్‌లైన్స్ ఈ సర్వీసులను ఆదివారం (అక్టోబర్ 25) నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురానుంది. ఉత్తరాంధ్ర నుంచి ఢిల్లీకి ఇదే మొట్టమొదటి డైరెక్ట్ ఫ్లైట్ కావడం గమనార్హం. ఈ కొత్త సర్వీసు షెడ్యూల్ ప్రకారం, ప్రతిరోజూ ఉదయం 6:00 గంటలకు ఢిల్లీలో బయలుదేరే విమానం, ఉదయం 8:00 గంటలకు భోగాపురం విమానాశ్రయానికి చేరుకుంటుంది. అనంతరం, ఇక్కడి నుంచి తొలి సర్వీసుగా ఉదయం 8:30 గంటలకు అదే విమానం ఢిల్లీకి తిరుగు ప్రయాణం అవుతుంది. ఈ చారిత్రక సేవలను ప్రారంభించడం కోసం విమానాశ్రయంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. జీఎంఆర్ సీఈవో/సీసీఏఓ కన్వర్ బీర్ సింగ్ కారా, ఆకాశ ఎయిర్‌లైన్స్ మేనేజర్ భూపతిరాజు అచ్యుత రామరాజు ఈ కార్యక్రమానికి హాజరై కేక్ కట్ చేసి, తొలి ప్రయాణికులకు టికెట్లను స్వయంగా అందజేయనున్నారు.



ఇప్పటివరకు ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలు ఢిల్లీ వెళ్లాలంటే కనెక్టింగ్ ఫ్లైట్లపై ఆధారపడాల్సి వచ్చేది. ఈ కొత్త డైరెక్ట్ సర్వీసుతో ప్రయాణ సమయం గణనీయంగా ఆదా కావడంతో పాటు ప్రయాణం మరింత సులభతరం, సౌకర్యవంతం కానుంది. ఈ పరిణామం పట్ల ఉత్తరాంధ్ర వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# తుపాను ముప్పుపై అప్రమత్తంగా ఉండాలి

- మత్స్యకారుల ప్రాణరక్షణే ప్రథమ ప్రాధాన్యం
- సముద్రంలో ఉన్న 91 మత్స్యకార బోట్లను సురక్షితంగా తీరానికి చేర్చేందుకు చర్యలు చేపట్టాలి
- అన్ని తీరప్రాంత జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు.. నిరంతర పర్యవేక్షణ
- మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి, అక్టోబర్ 24 (సమయం న్యూస్) :** బంగాళాఖాతంలో ఏర్పడిన బలమైన అల్పపీడనం తుపానుగా మారే అవకాశమున్న నేపథ్యంలో రాష్ట్రంలోని తీరప్రాంత జిల్లాల అధికారులు పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. తుపాను ప్రభావంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ మేరకు శనివారం మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్‌తో మంత్రి ఫోన్‌లో మాట్లాడి తుపాను ప్రభావం, సముద్రంలో ఉన్న మత్స్యకార బోట్ల పరిస్థితి, తీరప్రాంత జిల్లాల్లో చేపట్టిన ముందస్తు చర్యలపై సమీక్షించారు. భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈ నెల 26 నాటికి తుపాను ఏర్పడి, 28 నాటికి ఆంధ్రప్రదేశ్ తీరానికి సమీపించే అవకాశమున్న నేపథ్యంలో అధికారులు ఎక్కడా నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం 5 గంటల నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మొత్తం 30,043 మత్స్యకార బోట్లలో 29,952 బోట్లు హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల్లో సురక్షితంగా ఉండగా, మరో 91 బోట్లు సముద్రంలో ఉన్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. వీటిలో విశాఖపట్నం జిల్లాలో 37, అనకాపల్లిలో 1, కాకినాడలో 1, కృష్ణా జిల్లాలో 20, బాపట్ల జిల్లాలో 32 బోట్లు ఉన్నట్లు తెలిపారు. సముద్రంలో ఉన్న 91 బోట్లలో 72 మెకనైజ్డ్, 19 మోటరైజ్డ్ బోట్లు ఉన్నాయని వెల్లడించారు. ఈ బోట్లన్నీ వీలైనంత త్వరగా సురక్షితంగా తీరానికి చేరుకునేలా పటిష్ఠ చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. మత్స్యకార సంఘాలు, బోటు యజమానులు, హార్బర్ అధికారులు, కోస్ట్‌గార్డ్, మెరైన్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ సముద్రంలో ఉన్న ప్రతి బోటు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌కు 1,053 కిలోమీటర్ల పొడవైన తీరప్రాంతం ఉందని, రాష్ట్రంలోని 12 తీరప్రాంత జిల్లాల పరిధిలో 555 సముద్ర మత్స్యకార గ్రామాలు, 350 చేపల ల్యాండింగ్ కేంద్రాలు, ఉన్నాయని తెలిపారు. భారత వాతావరణ శాఖ ఇప్పటికే సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులందరూ తమ పడవలతో తక్షణమే సురక్షితంగా తీరానికి చేరుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని తీరప్రాంత జిల్లాల్లో జిల్లా మత్స్యశాఖ అధికారులు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు కమిషనర్ రామశంకర్ నాయక్ మంత్రికి వివరించారు. మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ సముద్రంలో చేపల వేటకు వెళ్లకుండా చూడాలని, తీరప్రాంత గ్రామాల్లో తుపాను హెచ్చరికలపై విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, బాపట్ల తదితర తీరప్రాంత జిల్లాల్లో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. సముద్రంలో అలల ఉద్ధృతి, బలమైన గాలుల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని బోట్లు, వలలు, ఇతర మత్స్యకార సామగ్రిని సురక్షిత ప్రాంతాల్లో భద్రపరచుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మరోవైపు తుపాను ప్రభావంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున రైతులు కూడా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. ముఖ్యంగా కోత దశకు చేరుకున్న పంటలు, కోసిన ధాన్యం, ఉద్యాన పంటలు దెబ్బతినకుండా వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందించాలన్నారు. పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా కాలువలు సిద్ధం చేసుకోవాలని, ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాల్లో భద్రపరచుకోవాలని, అరటి, బొప్పాయి వంటి ఉద్యాన పంటలకు అవసరమైన ఆధారాలు ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఆక్వా రైతులు చెరువుల గట్లు, నీటి పారుదల వ్యవస్థలు, విద్యుత్ భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో వ్యవసాయ, ఉద్యాన, మత్స్యశాఖల క్షేత్రస్థాయి అధికారులు అందుబాటులో ఉండాలని, వాతావరణ శాఖ హెచ్చరికలను ఎప్పటికప్పుడు రైతులు, మత్స్యకారులకు చేరవేయాలని ఆదేశించారు. ప్రజల ప్రాణాల కంటే విలువైనది మరొకటి లేదని, మత్స్యకారులు తమ ప్రాణాలను పణంగా పెట్టి సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని మంత్రి అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు. తుపాను ముప్పు పూర్తిగా తొలగే వరకు సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేసి రైతులు, మత్స్యకారుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

# 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలి

- ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా కావాలి
- తుపాను నేపథ్యంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సూచన



**అమరావతి, అక్టోబర్ 24 (సమయం న్యూస్) :** అర్నాబ్ తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఆర్అండ్‌బీ శాఖ యంత్రాగాన్ని రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అప్రమత్తం చేశారు. తుపాను ప్రభావం పూర్తిగా తగ్గే వరకు అధికారులు, సిబ్బంది 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేస్తూ.. ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. తుపాను పరిస్థితులపై ఈఎన్సీ, సీఈ, ఇతర ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని దిశా నిర్దేశం చేశారు. పరిస్థితులు పూర్తిగా సద్దుమణిగే వరకు అధికారులు హెడ్‌క్వార్టర్స్‌ను విడిచి వెళ్లరాదని స్పష్టం చేశారు. ప్రమాదకర వాగులు, కాజ్‌వేలు, వంతెనల వద్ద ముందస్తుగా బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని పేర్కొన్నారు. రహదారులపై చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిన వెంటనే తొలగించేలా జేసీబీలు, రెస్క్యూ బృందాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. భారీ వర్షాలతో దెబ్బతిన్న రహదారులకు తక్షణమే తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించడంతో పాటు.. ప్రజా రవాణాకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ముందుగానే గుర్తించాలని ఆదేశించారు. జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అత్యవసర సమాచారం అందిన వెంటనే స్పందించేలా అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ.. ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా ఆర్అండ్‌బీ శాఖ యంత్రాంగం పూర్తి అప్రమత్తతతో పనిచేయాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు.

# పురపోరు.. నవంబరు 1న.. 3న ఓట్ల లెక్కింపు

- సవరించిన షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల కమిషన్...
- 4 పట్టణ స్థానిక సంస్థల్లో నామినేషన్ల స్వీకరణ గడువు పొడిగింపు
- ముందే వాయిదా పడిన మైదుకూరు పురపాలక సంఘంలో 32 వార్డులకూ..సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో.. మరో 3 పట్టణ స్థానిక సంస్థల్లో 40 స్థానాలకు అవకాశం
- అక్కడి కలెక్టరేట్లలోనూ నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చు



**అమరావతి, అక్టోబర్ 24 (సమయం న్యూస్) :** రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సవరించిన షెడ్యూల్ను రాష్ట్ర ఎన్నికల సంఘం గురువారం రాత్రి విడుదల చేసింది. తాజా షెడ్యూలు ప్రకారం 13 నగరపాలక సంస్థలు, 87 పురపాలక సంఘాలు/ నగర పంచాయతీలకు నవంబరు 1న పోలింగ్ జరగనుంది. అవసరమైన చోట్ల 2న రీపోలింగ్ నిర్వహించి 3న ఓట్లు లెక్కించనున్నారు. ఇప్పటికే ఎన్నికల ప్రక్రియ వాయిదా పడిన మైదుకూరు పురపాలక సంఘంలో అన్ని(32) వార్డులతో పాటు సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో రాజంపేట పురపాలక సంఘంలోని 11 వార్డులకు నామినేషన్ దాఖలు సమయాన్ని పొడిగించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. వీటితో పాటు కడప కార్పొరేషన్లోని 11, తిరుపతిలోని 18 డివిజన్లకు కూడా కొత్తగా అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చని ఎస్ఈసీ పేర్కొంది. మొత్తంగా 72 వార్డులు/ డివిజన్లకు నామినేషన్లు స్వీకరిస్తారు. పోటీకి సిద్ధపడిన అభ్యర్థుల్ని బెదిరించడం, దాడి చేయడం, నామినేషన్ పత్రాలు చించివేయడం తదితర ఘటనల నేపథ్యంలో కొందరు నామినేషన్ వేయలేకపోయినట్లు గుర్తించామని, వారికి పోటీచేసే అవకాశాన్ని కల్పించేందుకు నామినేషన్ల గడువును పొడిగిస్తున్నట్లు తెలిపింది. 23, 24 తేదీల్లో నామినేషన్ల స్వీకరణ, 25న ఉదయం నామినేషన్ల పరిశీలన, అదేరోజు ఉపసంహరణకు గడువుగా నిర్ణయిస్తూ గురువారం సవరించిన నోటిఫికేషన్ విడుదల చేసింది. తొలివిడతలో 13 నగరపాలక సంస్థలు, 87 పురపాలక సంఘాలు, నగర పంచాయతీలకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 16 నుంచి 18 వరకు నామినేషన్లు స్వీకరించడంతో పాటు 21న మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణలకు అనుమతించింది. అయితే, తమ అభ్యర్థులను నామినేషన్లు వేయనీయకుండా అడ్డుకున్నారంటూ వైకాపా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారించిన సర్వోన్నత న్యాయస్థానం.. అభ్యర్థుల తుది జాబితా ప్రచురణను ఈ నెల 25 వరకు వాయిదా వేయాలని ఆదేశించింది. పిటిషనర్ పార్టీ, అభ్యర్థులు సమర్పించిన వినతుల్ని, సాక్ష్యాలు, ఎలక్ట్రానిక్ ఆధారాలు పరిశీలించాలని ఆదేశించింది. శాంతిభద్రతల సమస్యల కారణంగా నామినేషన్లు వేయలేకపోయారని భావిస్తే.. వారికి అవకాశం కల్పించాలని, నామినేషన్ల దాఖలుకు గడువు పొడిగించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. 22వ తేదీలోగా కమిషన్ తన నిర్ణయాన్ని ప్రకటించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. నామినేషన్కు గడువు పొడిగించాలని నిర్ణయిస్తే.. అక్కడ నోటిఫికేషన్ ఇచ్చిన తేదీ నుంచి కనీసం 48 గంటలకు తక్కువ కాకుండా గడువు ఇవ్వాలని నిర్దేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 100 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల ప్రక్రియను తాత్కాలికంగా నిలిపేస్తున్నట్లు కమిషన్ బుధవారం రాత్రి ప్రకటించింది. అన్ని పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించి కలెక్టర్లు/జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్ల నుంచి నివేదికలు తెప్పించి గురువారం వాటిని పరిశీలించింది. ఎలక్ట్రానిక్ ఆధారాలతో పాటు ఇతర అన్ని సాక్ష్యాలను పరిగణనలోకి తీసుకుంది. మైదుకూరు, రాజంపేట మున్సిపాలిటీలు, కడప, తిరుపతి కార్పొరేషన్లలోని 72 వార్డులు/ డివిజన్లకు మళ్లీ నామినేషన్లు తీసుకోవాలని నిర్ణయించింది. ఈ స్థానాలకు గతంలో ప్రకటించిన నామినేషన్ కేంద్రాలతో పాటు అదనంగా జిల్లా కలెక్టరేట్ల ప్రాంగణాల్లోనూ నామినేషన్లు స్వీకరిస్తారు. మిగిలిన చోట్ల నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి మార్పులేదు. తొలుత విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం 21న అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ, 28న పోలింగ్, 29న రీపోలింగ్, 30న ఓట్ల లెక్కింపు జరగాల్సి ఉంది. సవరించిన షెడ్యూల్ ప్రకారం 25న అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ, 1న పోలింగ్, 2న రీపోలింగ్, 3న ఓట్ల లెక్కింపు ఉంటుంది. సిరిమాను ఉత్సవం నేపథ్యంలో విజయనగరం నగరపాలక సంస్థకు అక్టోబరు 28న కాకుండా.. 29న పోలింగ్ నిర్వహించాలని ఎన్నికల కమిషన్ గతంలో ఆదేశాలిచ్చింది. షెడ్యూలు మారిన నేపథ్యంలో ఇక్కడ కూడా నవంబరు 1న పోలింగ్ నిర్వహించనున్నారు.



# చంద్రబాబు చేతిలో కీలుబొమ్మలా ఎస్ఈసీ

## ప్రభుత్వం, ఎస్ఈసీ, పోలీసులు కుమ్మక్కై ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారు

## మాజీ మంత్రి అంబటి రాంబాబు ధ్వజం

**గుంటూరు, అక్టోబర్ 24 (సమయం న్యూస్) :** స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో తెలుగుదేశం ప్రభుత్వం, పోలీసులు, ఎన్నికల కమిషన్ కుమ్మక్కై రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాయని వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్రంగా మండిపడ్డారు. గుంటూరులోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ అరాచకాలను, పోలీసుల చర్యలను తీవ్రంగా ఎండగట్టారు. ఎన్నికల ప్రక్రియలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని, నామినేషన్లు వేసే అభ్యర్థులకు రక్షణ కల్పించాలని స్పష్టం చేసినప్పటికీ, రాష్ట్రంలో ఎక్కడా సక్రమంగా నామినేషన్లు వేయని పరిస్థితి నెలకొందని అంబటి రాంబాబు ఆరోపించారు. రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ చంద్రబాబు చేతిలో కీలుబొమ్మలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నామినేషన్ కేంద్రాల్లోకి మీడియాను అనుమతించకుండా, పోలీసుల సమక్షంలోనే ప్రతిపక్ష అభ్యర్థుల నామినేషన్ పత్రాలను చించివేస్తూ ఏకపక్షంగా 'ఏకగ్రీవాలు' చేసుకుంటున్నారని మండిపడ్డారు. అక్రమాలకు, దౌర్జన్యాలకు పాల్పడుతున్న ఐపీఎస్ అధికారులతో పాటు సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు సహా మొత్తం 54 మంది పోలీసు అధికారులను తాము గుర్తించామని, వీరిపై న్యాయస్థానాలను ఆశ్రయించి న్యాయ పోరాటం చేస్తామని అంబటి రాంబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న ఈ అరాచకాలను, దౌర్జన్యాలను ప్రజలందరూ గమనిస్తున్నారని, స్దానిక సంస్థల ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. గుంటూరు మేయర్ పదవికి పోటీ చేస్తున్న శ్రీదేవిని, కార్పొరేటర్ అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఢిల్లీకి 'సర్' ఏఐసీసీ అబ్జర్వర్లుగా రఘువీరా రెడ్డి, రుద్రరాజు

## 1న జరిగే బహిరంగ సభ నిర్వహణపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం సమీక్ష



**న్యూఢిల్లీ, అక్టోబర్ 24 (సమయం న్యూస్):** ఓటర్ల జాబితాకు సంబంధించి భారత ఎన్నికల సంఘం చేపట్టే ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియ (సర్)కి సంబంధించి ఏఐసీసీ అబ్జర్వర్లుగా ఢిల్లీకి మాజీ పీసీసీ అధ్యక్షులు ఎన్.రఘువీరా రెడ్డి, గిడుగు రుద్రరాజును కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు నవంబరు 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో జరిగే "ఓట్ బచావ్.. దేశ్ బచావ్" భారీ బహిరంగ సభకు జన సమీకరణ, ఇతర ఏర్పాట్లపై శనివారం ఇందిరా భవన్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కెసి వేణుగోపాల్ అధ్యక్షతన ఢిల్లీ పీసీసీ అధ్యక్షుడు దేవేంద్ర యాదవ్, ఏఐసీసీ ట్రెజరర్ అజయ్ మాకెన్, ఢిల్లీ వ్యవహారాల ఇంచార్జ్ ఖాజీ నిజాముద్దీన్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పీసీసీ మాజీ అధక్షులు, మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, వివిధ విభాగాల అధిపతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ పీసీసీ అధ్యక్షులు ఎన్.రఘువీరా రెడ్డి, గిడుగు రుద్రరాజు హాజరయ్యారు.

# ఏపీ పరిషత్ పోరుకు పోటెత్తిన నామినేషన్లు..

## నువ్వా నేనా అంటున్న టీడీపీ, వైఎస్సార్‌సీపీ!

**అమరావతి, అక్టోబర్ 25 (సమయం న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల పర్వం ముగిసింది. పరిషత్ పోరులో పోటీ చేసేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల నుంచి భారీ ఎత్తున స్పందన లభించింది. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో ఉన్న 659 జెడ్పీటీసీ స్థానాలకు మొత్తం 5,724 నామినేషన్లు, 9,829 ఎంపీటీసీ స్థానాలకు ఏకంగా 51,902 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల చివరి రోజున అత్యధికంగా జెడ్పీటీసీలకు 3,315, ఎంపీటీసీలకు 25,016 నామినేషన్లు రావడంతో రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కింది. నామినేషన్ల దాఖలులో అధికార, ప్రతిపక్ష పార్టీలు పోటీపడ్డాయి. ఎంపీటీసీ స్థానాలకు టీడీపీ తరఫున అత్యధికంగా 22,013 నామినేషన్లు దాఖలు కాగా, వైఎస్సార్‌సీపీ నుంచి 20,556 మంది నామినేషన్లు వేశారు. కూటమి భాగస్వామ్య పక్షాలైన జనసేన తరఫున 4,609 మంది, బీజేపీ నుంచి 1,150 మంది తమ అభ్యర్థిత్వాలను నమోదు చేసుకున్నారు. జెడ్పీటీసీ స్థానాలకు సంబంధించి టీడీపీ తరఫున 2,078 నామినేషన్లు, వైఎస్సార్‌సీపీ నుంచి 1,815 నామినేషన్లు దాఖలయ్యాయి. జనసేన నుంచి 679 మంది, బీజేపీ తరఫున 255 మంది నామినేషన్లు వేసి బరిలో నిలిచారు. ఇంత భారీ సంఖ్యలో ప్రజాస్వామ్యబద్ధంగా నామినేషన్లు దాఖలైనప్పటికీ, కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కూటమి నేతలు మండిపడ్డారు. జగన్ తీరు 'హిట్ అండ్ రన్' థియరీలా ఉందని, కేవలం ప్రెస్ మీట్లు పెట్టడానికే బెంగళూరు నుంచి అమరావతికి వస్తూ నిరాధార వ్యాఖ్యలు చేసి వెళ్లిపోతున్నారని విమర్శించారు. క్షేత్రస్థాయి వాస్తవాలను గమనించకుండా రాజకీయ లబ్ధి కోసం ఆరోపణలు చేస్తున్నారని అధికార పక్ష నేతలు ఆరోపించారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తవ్వడంతో పరిషత్ సమరం రసవత్తరంగా మారింది.

## సంపాదకీయం



# హారన్ మోత మోగితే.. జరిమానా వాత తప్పదు!

### రోడ్లపై ఇష్టారాజ్యంగా హారన్లు మోగిస్తే చర్యలు

### మలుపులు, లేన్ మార్పుల్లో ఇండికేటర్ తప్పనిసరి

**రోడ్డెక్కితే హారన్ మోత.. సిగ్నల్ పడితే అసహనం.. ముందు వాహనం కాస్త ఆలస్యంగా కదిలితే చాలు వెనుక నుంచి చెవులు చిల్లులు పడేలా శబ్దాలు! నగరాలు, పట్టణాల్లోనే కాదు.. గ్రామీణ రహదారులపైనా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అవసరం ఉన్నా లేకపోయినా హారన్ మోగించడం కొందరికి అలవాటుగా మారిపోయింది. మరికొందరైతే మలుపులు తిరిగేటప్పుడు ఇండికేటర్ వేయడం కూడా అనవసరమన్నట్లు వ్యవహరిస్తున్నారు. రహదారిపై తమకు మాత్రమే హక్కు ఉన్నట్లు ప్రవర్తిస్తూ ఇతరుల భద్రతను ప్రమాదంలో పడేస్తున్నారు. ఇలాంటి నిర్లక్ష్యపు అలవాట్లు కేవలం ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలే కాదు.. సమాజంలో పెరుగుతున్న అసహనానికి, క్రమశిక్షణ లోపానికి నిదర్శనాలు.**

వాహనాలకు హారన్ ఏర్పాటు చేసిన ప్రధాన ఉద్దేశం ప్రమాదాలను నివారించడం. ఎదురుగా వచ్చే వాహనదారులను, రహదారి దాటుతున్న పాదచారులను అప్రమత్తం చేయడానికే దాన్ని వినియోగించాలి. కానీ నేడు పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా మారుతోంది. ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఎరుపు దీపం వెలుగుతున్నా వెనుక నుంచి హారన్లు మోగిస్తూనే ఉంటారు. ముందు వాహనం కదలడానికి అవకాశం లేకపోయినా శబ్దాలతో ఒత్తిడి పెంచుతారు. హారన్ మోగిస్తే ట్రాఫిక్ తొలగిపోతుందన్న అపోహలో కొందరు వ్యవహరిస్తున్నారు. ఈ ధోరణి వల్ల రహదారులపై అనవసర శబ్ద కాలుష్యం పెరుగుతోంది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఆసుపత్రులు, పాఠశాలలు, నివాస ప్రాంతాల సమీపంలో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది. ఒకరి తొందరపాటు మరొకరి ప్రశాంతతను దెబ్బతీయకూడదన్న కనీస సామాజిక స్పృహ ప్రతి వాహనదారుడిలో ఉండాలి.

#### శబ్ద కాలుష్యం.. కనిపించని ప్రమాదం!

వాయు కాలుష్యం గురించి విస్తృతంగా చర్చిస్తున్న సమాజం శబ్ద కాలుష్యాన్ని మాత్రం పెద్దగా పట్టించుకోవడం లేదు. వాహనాల హారన్లు, అధిక శబ్దం చేసే సైలెన్సర్లు, అదనంగా బిగించిన శబ్ద పరికరాలు ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. నిరంతరం అధిక శబ్దాలకు గురికావడం వల్ల మానసిక ఒత్తిడి, ఏకాగ్రత లోపం, నిద్రకు అంతరాయం వంటి సమస్యలు తలెత్తవచ్చు. అందుకే ప్రకటిత నిశ్శబ్ద ప్రాంతాల్లో హారన్ల వినియోగంపై ప్రత్యేక నియంత్రణలు ఉన్నాయి. అయినప్పటికీ కొందరు వాహనదారులు వాటిని పట్టించుకోవడం లేదు. రాత్రివేళ నివాస ప్రాంతాల్లో పెద్ద శబ్దాలతో హారన్లు మోగించడం ఇతరుల విశ్రాంతికి భంగం కలిగించడమే. శబ్దం చేయగలిగే అవకాశం ఉందని ప్రతిసారీ హారన్ మోగించడం సమంజసం కాదు. రోడ్డు ప్రమాదాలకు అతివేగం, మద్యం మత్తులో వాహనాలు నడపడం మాత్రమే కారణాలు కావు. చిన్నచిన్న నిర్లక్ష్యాలు కూడా తీవ్రమైన ప్రమాదాలకు దారితీస్తాయి. వాటిలో మలుపులు తిరిగేటప్పుడు, లేన్ మారేటప్పుడు ఇండికేటర్ వేయకపోవడం ఒకటి. వాహనం ఏ దిశగా వెళ్తుందో వెనుక వచ్చే వాహనదారులకు ముందుగానే తెలియాలి. అప్పుడే వారు తమ వేగాన్ని, దూరాన్ని సర్దుబాటు చేసుకోగలుగుతారు. కానీ కొందరు అకస్మాత్తుగా మలుపులు తిరుగుతూ ఇతరులను ప్రమాదంలోకి నెడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లు, భారీ వాహనాల డ్రైవర్లు ఎవరైనా సరే ఇండికేటర్ వినియోగాన్ని తప్పనిసరి అలవాటుగా మార్చుకోవాలి. మలుపు పూర్తయిన తర్వాత దాన్ని ఆపేయడం కూడా అంతే ముఖ్యం. పొరపాటున ఇండికేటర్ వెలుగుతూనే ఉంటే వెనుక వచ్చే వాహనదారులకు తప్పుడు సంకేతాలు వెళ్లే ప్రమాదం ఉంది.

#### నిబంధనలు ఉన్నా.. అమలులో నిర్లక్ష్యం ఎందుకు?

మోటారు వాహనాల చట్టంలో అనవసర హారన్ల వినియోగం, నిబంధనలకు విరుద్ధంగా శబ్ద పరికరాల్లో మార్పులు చేయడం వంటి ఉల్లంఘనలపై చర్యలకు అవకాశం ఉంది. సెక్షన్ 194ఎఫ్ ప్రకారం సంబంధిత ఉల్లంఘనలకు జరిమానాలు విధించవచ్చు. అలాగే వాహనాన్ని మళ్లించే ముందు అవసరమైన సంకేతాలు ఇవ్వకపోవడం వంటి చర్యలకు సెక్షన్ 177తోపాటు వర్తించే ఇతర నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అయితే చట్టాలు ఉన్నంత మాత్రాన సమస్య పరిష్కారం కాదు. వాటిని సమర్థంగా అమలు చేయడంతోపాటు వాహనదారుల్లో అవగాహన పెంచడం అత్యవసరం. ట్రాఫిక్ పోలీసులు కేవలం చలాన్లు విధించడానికే పరిమితం కాకుండా నిబంధనల ప్రాధాన్యాన్ని వివరించే కార్యక్రమాలు నిర్వహించాలి. వాహనాల తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధమైన అధిక శబ్ద హారన్లను గుర్తించి చర్యలు తీసుకోవాలి. రహదారి ఏ ఒక్కరి సొత్తు కాదు. వాహనదారులు, పాదచారులు, సైకిల్‌పై వెళ్లేవారు, ప్రజా రవాణాను వినియోగించేవారు.. అందరికీ దానిపై సమాన హక్కు ఉంది. ఒకరి నిర్లక్ష్యం మరొకరి ప్రాణాలకు ముప్పుగా మారకూడదు. ముఖ్యంగా వాహనం నడిపేటప్పుడు సహనం అత్యంత అవసరం. ముందు వాహనం నెమ్మదిగా వెళ్తున్నా పరిస్థితిని అర్థం చేసుకోవాలి. ట్రాఫిక్ సిగ్నల్ వద్ద కొన్ని క్షణాలు వేచి ఉండాల్సి వచ్చినా అసహనం ప్రదర్శించకూడదు. అనవసర హారన్లతో ఇతరులను ఇబ్బంది పెట్టకుండా, సరైన సమయంలో ఇండికేటర్లు ఉపయోగిస్తూ, నిర్ణీత వేగ పరిమితులను పాటిస్తూ ప్రయాణించాలి. వాహనం మరమ్మతులకు గురైనప్పుడు పరిస్థితికి అనుగుణంగా ప్రమాద హెచ్చరిక దీపాలను ఉపయోగించి, సాధ్యమైనంత త్వరగా సురక్షిత ప్రదేశానికి తరలించాలి. హారన్ మోగించడం వల్ల ముందున్న వాహనం వేగంగా కదలకపోవచ్చు. కానీ ఆ శబ్దం కారణంగా ఇతరులు అసహనానికి, ఆందోళనకు గురయ్యే అవకాశం ఉంది. ఇండికేటర్ వేయకుండా మలుపు తిరిగితే కొన్ని క్షణాల సమయం ఆదా కావచ్చేమో కానీ ప్రమాదం జరిగితే దాని మూల్యం ఎంతో భారీగా ఉంటుంది. అందుకే ట్రాఫిక్ నిబంధనలను జరిమానాల నుంచి తప్పించుకునే మార్గంగా కాకుండా ప్రాణాలను కాపాడే రక్షణ కవచంగా భావించాలి. రహదారిపై మనం చూపించే సహనం, క్రమశిక్షణ, బాధ్యతాయుత ప్రవర్తనే నాగరిక సమాజానికి అసలైన గుర్తింపు. హారన్ మోత తగ్గాలి.. రహదారులపై బాధ్యత పెరగాలి. జరిమానా పడకముందే మన ప్రవర్తన మారాలి. అప్పుడే రోడ్డు ప్రయాణం అందరికీ సురక్షితంగా, ప్రశాంతంగా మారుతుంది.

# ఎన్నికల కోసం విద్యార్థుల పోరు

### జామియాలో ఉద్రిక్తత!

- విద్యార్థి సంఘం పునరుద్ధరణ కోసం ఆమరణ నిరాహార దీక్షలు
- నిరసన టెంట్ల తొలగింపు ప్రయత్నంతో భద్రతా సిబ్బందితో ఘర్షణ
- 2006 నుంచి నిలిచిపోయిన విద్యార్థి సంఘం ఎన్నికలు
- క్యాంపస్‌లోకి ప్రవేశించిన కాంగ్రెస్ ఎంపీలపై రిజిస్ట్రార్ ఆరోపణలు
- గోడలపై వివాదాస్పద నినాదాలు.. విచారణకు బీజేపీ డిమాండ్
- ఉద్రిక్త పరిస్థితులతో తరగతుల నిర్వహణ ఆన్‌లైన్‌కు మార్పు




**న్యూఢిల్లీ, అక్టోబర్ 24 (సమయం న్యూస్):** దేశ రాజధాని ఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయంలో విద్యార్థి సంఘం ఎన్నికల కోసం చేపట్టిన ఆందోళనలు ఉద్రిక్తతకు దారితీశాయి. విద్యార్థి సంఘాన్ని పునరుద్ధరించి వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ఆమరణ నిరాహార దీక్షలకు దిగారు. శనివారం నిరసన టెంట్లను తొలగించేందుకు భద్రతా సిబ్బంది ప్రయత్నించడంతో విద్యార్థులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట, ఘర్షణ చోటుచేసుకోవడంతో క్యాంపస్‌లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయంలో 2006లో జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో విద్యార్థి సంఘాన్ని రద్దు చేశారు. అప్పటి నుంచి విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించడం లేదు. విద్యార్థులకు ప్రజాస్వామ్యబద్ధమైన ప్రాతినిధ్యం కల్పించాలని, సంఘాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 12 నుంచి విద్యార్థులు నిరసనలు కొనసాగిస్తున్నారు. తమ డిమాండ్లను నెరవేర్చే వరకు ఆందోళన విరమించేది లేదని నిరసనకారులు స్పష్టం చేస్తున్నారు. శుక్రవారం కాంగ్రెస్ ఎంపీలు ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ, ఇమ్రాన్ మసూద్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలోకి గోడ దూకి ప్రవేశించారన్న ఘటన వివాదాస్పదమైంది. ఈ విషయంపై జామియా రిజిస్ట్రార్ మహతాబ్ ఆలం రిజ్వీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇద్దరు కాంగ్రెస్ నాయకులు క్యాంపస్‌లోకి ప్రవేశించి విద్యార్థులను రెచ్చగొట్టారని, రాజకీయ ప్రయోజనాల కోసం వారిని ఉపయోగించుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఈ ఘటనపై ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. మరోవైపు విశ్వవిద్యాలయ గోడలపై జమ్మూకశ్మీర్‌కు సంబంధించిన వివాదాస్పద నినాదాలు కనిపించడం రాజకీయ చర్చకు దారితీసింది. వాటిని దేశ వ్యతిరేక నినాదాలుగా పేర్కొన్న బీజేపీ, ఘటనపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేసింది. నినాదాలు ఎవరు రాశారనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. విద్యార్థుల నిరసనలు, భద్రతా సిబ్బందితో ఘర్షణ నేపథ్యంలో క్యాంపస్‌లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఈ పరిణామాల దృష్ట్యా తరగతుల నిర్వహణను ఆన్‌లైన్ విధానానికి మార్చినట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ వెల్లడించారు. విద్యార్థి సంఘం ఎన్నికల నిర్వహణపై యాజమాన్యం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

# ఆపరేషన్ సిందూర్.. ట్రంప్ నోట మళ్లీ అదే పాట!

- భారత్-పాక్ యుద్ధాన్ని తానే ఆపానంటూ మరోసారి ప్రకటన
- ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది యుద్ధాలను నిలువరించానని వ్యాఖ్యలు
- ఐక్యరాజ్యసమితి సహకారం లేకుండానే శాంతి నెలకొల్పానని వెల్లడి
- నోబెల్ శాంతి బహుమతి రాకపోవడంపై అసంతృప్తి
- అమెరికా మధ్యవర్తిత్వం లేదని ఇప్పటికే స్పష్టం చేసిన భారత్



**వాషింగ్టన్, అక్టోబర్ 24 (సమయం న్యూస్):** భారత్, పాకిస్థాన్ మధ్య సైనిక ఘర్షణను తానే నిలువరించానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వ్యాఖ్యానించారు. అమెరికా మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో ఫ్లోరిడాలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో మాట్లాడిన ఆయన 'ఆపరేషన్ సిందూర్' అంశాన్ని ప్రస్తావించారు. అణ్వాయుధాలు కలిగిన భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తన దౌత్య ప్రయత్నాలతో ఆపినట్లు మరోసారి చెప్పుకొచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది యుద్ధాలను నిలువరించానని, ఇందుకోసం ఐక్యరాజ్యసమితికి ఒక్క ఫోన్ కూడా చేయాల్సిన అవసరం రాలేదని పేర్కొన్నారు. ఇన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ తనకు నోబెల్ శాంతి బహుమతి దక్కలేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు.

#### మధ్యవర్తిత్వ వాదనను ఖండించిన భారత్

2025 ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా అదే ఏడాది మే నెలలో పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై భారత్ 'ఆపరేషన్ సిందూర్' పేరుతో దాడులు నిర్వహించింది. అనంతరం ఇరు దేశాల మధ్య సైనిక ఉద్రిక్తతలు నెలకొన్నాయి. అయితే ఈ ఘర్షణను నిలువరించడంలో అమెరికా మధ్యవర్తిత్వం లేదని భారత ప్రభుత్వం ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసింది. పాకిస్థాన్ అభ్యర్థన మేరకు ఇరు దేశాల సైనిక ఉన్నతాధికారుల మధ్య జరిగిన ప్రత్యక్ష చర్చల అనంతరమే సైనిక చర్యలను నిలిపివేసినట్లు వెల్లడించింది. అయినప్పటికీ ట్రంప్ మాత్రం భారత్, పాకిస్థాన్ మధ్య ఘర్షణను తానే ఆపానన్న వాదనను పునరావృతం చేస్తున్నారు. ఆయన తాజా వ్యాఖ్యలతో అమెరికా మధ్యవర్తిత్వంపై మరోసారి చర్చ మొదలైంది.



# ర్యాలీ వాయిదా వేయండి

### రూ.10 వేల కోట్ల నష్టం తప్పించండి!

### రాహుల్ గాంధీకి ఢిల్లీ వ్యాపార సంఘాల విజ్ఞప్తి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 24 (సమయం న్యూస్):** నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ సహా ఇండియా బ్లాక్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టనున్న సంగతి తెలిసిందే. అయితే, దీపావళిని దృష్టిలో ఉంచుకుని ఈ ర్యాలీని వాయిదా వేసుకోవాలని ద ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) కోరింది. లేకపోతే రూ.10,000 కోట్ల వరకు నష్టం వాటిల్లుతుందని వివరించింది. ఈ మేరకు సీటీఐ ఛైర్మన్ బ్రిజేష్ గోయల్ రాహుల్ గాంధీని కోరారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోరుతూ ఇండియా బ్లాక్ ఆధ్వర్యంలో రాంలీలా మైదానంలో ర్యాలీ జరగనుంది. ఈ ర్యాలీ సందర్భంగా ఆ రోజు వ్యాపార సంస్థలు అన్నీ మూసేయాల్సి ఉంటుంది. అలాగే, ముందు నుంచే అక్కడ పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలి. దీంతో ర్యాలీకి కొద్ది రోజుల ముందునుంచే వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు ఆటంకం కలుగుతుంది. ఈ నేపథ్యంలో సీటీఐ తరఫున ఆ సంస్థ చైర్మన్ బ్రిజేష్ గోయల్.. రాహుల్ గాంధీకి లేఖ రాశారు. ఆయన లేఖలో పేర్కొన్న వివరాల ప్రకారం.. దీపావళి, ధంతేరాస్ సందర్భంగా ఈ ప్రాంతంలో రూ.25,000 కోట్ల వ్యాపారం జరుగుతుంది. బంగారం, వెండితోపాటు ఎలక్ట్రానిక్స్, దుస్తులు, వంట సామగ్రి, డ్రైఫ్రూట్స్, స్వీట్స్, వాహనాలు, ఆస్తుల కొనుగోలు, గిఫ్ట్ ఐటమ్స్ వంటివి భారీ స్థాయిలో అమ్ముడుపోతాయి. అయితే, ఇండియా బ్లాక్ ర్యాలీ వల్ల ఈ వ్యాపారాలకు ఆటంకం కలుగుతుంది. దీనివల్ల రూ.10,000 కోట్ల నష్టం వాటిల్లే అవకాశం ఉంది. నవంబర్ 6న ధంతేరాస్, 8న దీపావళి, 10న భాయ్ దూజ్ వంటి పండుగులున్నాయి. అందువల్ల నవంబర్ 10 వరకు ఈ ర్యాలీని వాయిదా వేసుకోవాల్సిందిగా సూచించారు. పండుగలకు వారం రోజుల ముందు నుంచి వ్యాపారం ఉధృతంగా సాగుతుందన్నారు. ఇప్పటికే అక్టోబర్‌లో సాగిన అనేక ర్యాలీల వల్ల తీవ్రంగా నష్టపోయామన్నారు. రోడ్లు బ్లాక్ చేయడం, రవాణా సదుపాయం లేకపోవడం, ప్రభుత్వ ఆంక్షల వల్ల ఇబ్బందులు పడుతున్నామన్నారు. అందువల్ల తమ విన్నపాన్ని దృష్టిలో ఉంచుకుని నవంబర్ 10 వరకు ర్యాలీని వాయిదా వేసుకోవాలని, ఆ తర్వాతే ర్యాలీ నిర్వహించుకోవాలని సూచించారు.

# ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

#### పార్కింగ్ బే వద్దకు ఫ్లైట్




**న్యూఢిల్లీ:** ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. టేకాఫ్‌కు ముందు ఫ్లైట్ టాయిలెట్‌లో ఈ బెదరింపు సందేశాన్ని సిబ్బంది గుర్తించారు. ఈ నేపథ్యంలో ఆ విమానం పార్కింగ్ బే వద్దకు తిరిగి చేరుకున్నది. ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఐజీఐ)లో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం మధ్యాహ్నం 3.15 గంటలకు ఇండిగో విమానం 6ఈ 6091, ఢిల్లీ నుంచి చెన్నైకు బయలుదేరాల్సి ఉన్నది. అయితే టేకాఫ్‌కు సిద్ధమవుతున్న సమయంలో ఆ విమానం వెనుక భాగంలోని టాయిలెట్‌లో ఒక 'హెచ్చరిక' నోట్ లభించింది. ఆ విమానాన్ని చెన్నైకి ప్రయాణం కొనసాగించవద్దని హెచ్చరించినట్లుగా అందులో ఉన్నది. కాగా, ఈ బెదిరింపు సందేశాన్ని విమాన సిబ్బంది గుర్తించారు. దీంతో సంబంధిత నిబంధనల ప్రకారం విమానం టేకాఫ్‌ను రద్దు చేశారు. దానిని తిరిగి బేకి తీసుకువచ్చారు. అవసరమైన ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని (ఎస్‌వోపీ) పూర్తి చేశారు. ఆ బెదిరింపు నోట్ బూటకమని తేలింది. ఈ నేపథ్యంలో సుమారు 2గంటలు ఆలస్యంగా శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయంలో విమానం టేకాఫ్ అయ్యింది. రాత్రి 7.40 గంటలకు చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో అది సురక్షితంగా ల్యాండ్ అయ్యిందని ఇండిగో అధికారి తెలిపారు.



# నేడు యూపీ, ఒడిశాలో ప్రధాని పర్యటన!

**వారణాసిలో గార్మెంట్ తయారీ కేంద్రం ప్రారంభం**

**నమో ఘాట్ వద్ద వాయుసేన విన్యాసాల వీక్షణం**

**భువనేశ్వర్‌లో ఆర్‌బీఐ డేటా సెంటర్, సైబర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభం**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 24 (సమయం న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అక్టోబర్ 25న (శుక్రవారం) ఉత్తరప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. ఉదయం యూపీలోని వారణాసిలో, సాయంత్రం ఒడిశాలోని భువనేశ్వర్‌లో ఏర్పాటు చేసిన పలు కీలక కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నారు. ప్రధాని మోదీ ఉదయం 11 గంటలకు వారణాసిలో కొత్తగా నిర్మించిన గార్మెంట్ తయారీ కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం మధ్యాహ్నం 1 గంటకు నమో ఘాట్ వద్ద ప్రతిష్టాత్మకంగా జరగనున్న 'ఎయిర్ ఫోర్స్ డే ఏరియల్ డిస్‌ప్లేఉ 2026'ను ఆయన వీక్షిస్తారు. భారత వాయుసేన 94వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని "వింగ్స్ ఓవర్ గంగా (ఔఐఅస్త్రం శీజవతీ +ఖఅస్త్రవం)" అనే థీమ్‌తో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఎయిర్ షోలో తేజస్, ఎల్‌సీహెచ్ ప్రచండ్, సుఖోయ్-30 ఎంకేఐ, రాఫెల్ తదితర అత్యాధునిక యుద్ధ విమానాలతో పాటు సూర్యకిరణ్, సారంగ్ బృందాలు ఆకాశంలో అబ్బురపరిచే విన్యాసాలు ప్రదర్శించనున్నాయి.

**భువనేశ్వర్‌లో కార్యక్రమాలు**

వారణాసి పర్యటన అనంతరం ప్రధాని ఒడిశాకు చేరుకుంటారు. సాయంత్రం 4:45 గంటలకు భువనేశ్వర్‌లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కొత్తగా ఏర్పాటు చేసిన డేటా సెంటర్, సైబర్ సెక్యూరిటీ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను ఆయన ప్రారంభిస్తారు. దేశంలో కీలక చెల్లింపులు, సెటిల్‌మెంట్ వ్యవస్థలకు సంబంధించిన మిషన్-క్రిటికల్ సదుపాయాలు ఈ కేంద్రంలో అందుబాటులో ఉండనున్నాయి. కొత్తగా అందుబాటులోకి వస్తున్న ఈ సైబర్ సెక్యూరిటీ సంస్థలో క్వాంటమ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), అత్యాధునిక సాంకేతికతలపై శిక్షణ, పరిశోధనలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

# రైల్వే భద్రతకు 'ఇంటెలిజెన్స్' పోలీసింగ్!

**ఆర్పీఎఫ్, జీఆర్పీ, రాష్ట్ర పోలీసుల మధ్య మరింత సమన్వయం**

**పండుగల రద్దీ నియంత్రణకు ముందస్తు ప్రణాళికలు**

**రాళ్ల దాడుల నివారణకు ప్రత్యేక నిఘా, పెట్రోలింగ్**

**8వ అఖిల భారత జీఆర్పీ చీఫ్‌ల సదస్సులో నిర్ణయం**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 24 (సమయం న్యూస్):** రైల్వే భద్రతను మరింత పటిష్టం చేసే దిశగా 'ఇంటెలిజెన్స్ ఆధారిత పోలీసింగ్' విధానాన్ని అమలు చేయాలని 8వ అఖిల భారత జీఆర్పీ చీఫ్‌ల సదస్సు తీర్మానించింది. రైల్వే రక్షణ దళం , ప్రభుత్వ రైల్వే పోలీస్ , ఆయా రాష్ట్రాల పోలీసుల మధ్య సమన్వయం మరింత పెంచాలని ఈ సదస్సులో కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రయాణికుల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు వేగంగా పరిష్కరించేందుకు జీఆర్పీ సిబ్బందిని 'రైల్ మదద్' యాప్‌తో అనుసంధానించారు.

**పండుగల వేళ ముందస్తు ప్రణాళికలు..**

త్వరలో రానున్న దీపావళి, ఛఠ్ పండుగల సందర్భంగా రైళ్లలో ప్రయాణికుల రద్దీ అనూహ్యంగా పెరగనున్న నేపథ్యంలో.. రద్దీ నియంత్రణ, ప్రయాణికుల సురక్షిత రాకపోకల కోసం ముందస్తు ప్రణాళికలకు అధికారులు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. అదేవిధంగా ఇటీవల తరచుగా జరుగుతున్న రైళ్లపై రాళ్లదాడులను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, పెట్రోలింగ్ ముమ్మరం చేయడంతో పాటు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు భారీగా చేపట్టాలని సూచించారు. ఈ సదస్సులో దక్షిణ మధ్య రైల్వే విజయవంతంగా అమలు చేస్తున్న 'పింక్ పెట్రోల్', మధ్య రైల్వే చేపట్టిన 'ప్రాజెక్ట్ దిశ' వంటి భద్రతా కార్యక్రమాలను ప్రత్యేకంగా ప్రదర్శించారు. రైల్వే భద్రతను పటిష్టం చేయడంలో ఇంటెలిజెన్స్ ఆధారిత పోలీసింగ్, ఆధునిక సాంకేతికత వినియోగం, విభాగాల మధ్య సమన్వయం అత్యంత కీలకమని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

# ఆర్టికల్ 370 కోసం పోరు ఉధృతం!

**జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇవ్వాల్సిందే..**

**కేంద్రం తన హామీలను నెరవేర్చలేదు**

**మా దేశభక్తిని ప్రశ్నిస్తారా అంటూ బీజేపీపై ఫైర్**

**హక్కుల సాధనకై ఐక్యంగా కదలాలన్న ఫరూఖ్ అబ్దుల్లా**

**బారాముల్లా, అక్టోబర్ 24 (సమయం న్యూస్):** ఆర్టికల్ 370 పునరుద్ధరణ, జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను తిరిగి సాధించుకునేందుకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను ఏమాత్రం నెరవేర్చలేదని ఆయన విమర్శించారు. శనివారం బారాముల్లాలో పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలంతా తమ హక్కులు, ప్రత్యేక గుర్తింపును కాపాడుకునేందుకు విభేదాలను పక్కనపెట్టి ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ధైర్యంగా అడుగులు వేస్తేనే లక్ష్యాన్ని చేరుకోగలమని కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు.

**మా దేశభక్తిని ప్రశ్నిస్తారా?**

జమ్మూ కాశ్మీర్ ప్రత్యేక గుర్తింపును బీజేపీ, కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా బలహీనపరుస్తున్నాయని ఫరూఖ్ అబ్దుల్లా ఆరోపించారు. హక్కుల కోసం డిమాండ్ చేయడాన్ని దేశ ద్రోహంగా పరిగణించడం దారుణమన్నారు. "మేము గాంధీ, నెహ్రూలు కలలుగన్న భారతదేశానికి చెందినవారం.. అలాంటి మా దేశభక్తిని ఎందుకు ప్రశ్నిస్తున్నారు?" అని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రజల రాజకీయ డిమాండ్లను దేశ వ్యతిరేకతతో ముడిపెట్టవద్దని హితవు పలికారు. ఆర్టికల్ 370 పునరుద్ధరణ కోసం తమ పార్టీ పోరాటం ఏమాత్రం వెనక్కి తగ్గబోదని ఈ సందర్భంగా ఆయన తేల్చిచెప్పారు.

# ఆర్థిక రంగంపై పార్లమెంటరీ ప్యానెల్ నజర్!

- క్రిప్టో, ఏఐ సహా 46 కీలక అంశాలపై సమగ్ర అధ్యయనం
- బ్యాంకింగ్, బీమా, కరెన్సీ నిర్వహణ తీరుపై సమీక్ష
- ఎస్టీ, ప్రత్యక్ష పన్నుల సంస్కరణలపైనా ప్రత్యేక దృష్టి
- కమిటీ చైర్మన్‌గా బీజేపీ ఎంపీ భర్తృహరి మహతాబ్



**న్యూఢిల్లీ, అక్టోబర్ 24 (సమయం న్యూస్):** దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటి కీలక అంశాలపై పార్లమెంటరీ స్థాయీ సంఘం ప్రత్యేక దృష్టి సారించింది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆర్థిక రంగాన్ని తీర్చిదిద్దే దిశగా సమగ్ర అధ్యయనానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా క్రిప్టో ఆస్తులు, ఆర్థిక రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం, బ్యాంకింగ్, బీమా, కరెన్సీ నిర్వహణ, పన్నుల సంస్కరణలు సహా ఏకంగా 46 అంశాలను 2026ఉ27 ఆర్థిక సంవత్సరంలో పరిశీలనకు ఎంపిక చేసింది. ఈ మేరకు లోతైన అధ్యయనాలు నిర్వహించి నివేదికలు రూపొందించనున్నట్లు లోక్‌సభ బులెటిన్ అధికారికంగా వెల్లడించింది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ నెల ప్రారంభంలోనే పార్లమెంటరీ స్థాయీ సంఘాలను పునర్వ్యవస్థీకరించారు. ఆర్థిక వ్యవహారాల స్థాయీ సంఘం చైర్మన్‌గా బీజేపీ ఎంపీ భర్తృహరి మహతాబ్‌కు మరోసారి బాధ్యతలు అప్పగించారు. ఈ ప్రతిష్టాత్మక కమిటీలో లోక్‌సభ నుంచి 21 మంది, రాజ్యసభ నుంచి 10 మంది సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక వ్యవహారాలు, వ్యయం, రెవెన్యూ, ఆర్థిక సేవలు, ప్రభుత్వ రంగ సంస్థలు, పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ లాంటి కీలక అంశాలను ఈ కమిటీ క్షుణ్ణంగా సమీక్షించనుంది.

**ఏఐ, క్రిప్టో ఆస్తులపై స్పెషల్ ఫోకస్..**

డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో వర్చువల్ డిజిటల్ ఆస్తుల (క్రిప్టో) వాస్తవ పరిస్థితులు, భవిష్యత్తులో తీసుకురావాల్సిన విధానాలపై కమిటీ సునిశితంగా అధ్యయనం చేయనుంది. ముఖ్యంగా బ్యాంకింగ్, ఆర్థిక సేవల్లో ఏఐ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలతో పాటు ఎదురయ్యే సవాళ్లను విశ్లేషించనుంది. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) నియంత్రణలో ఉన్న లోపాలను గుర్తించి, ఆర్థిక రంగంలో మరింత పర్యవేక్షణ, పారదర్శకత పెంచేందుకు తీసుకోవాల్సిన కఠిన చర్యలను పరిశీలించనుంది.

**ధరల స్థిరత్వం.. కరెన్సీ నిర్వహణ..**

దేశంలో ధరల స్థిరత్వం, రూపాయి విలువ పతనం కాకుండా చూడటం, పకడ్బందీగా కరెన్సీ నిర్వహణకు సంబంధించిన విధానాలను కమిటీ సమీక్షించనుంది. మారుతున్న ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) పోషించాల్సిన పాత్రను అంచనా వేయనుంది. చిన్న మొత్తాల పొదుపు పథకాలు, ప్రభుత్వ ఆస్తుల నగదీకరణ, బ్యాంకింగ్, పెన్షన్, ఆరోగ్య బీమా రంగాల పనితీరును లోతుగా అధ్యయనం చేయనుంది. అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించడం, కేంద్ర ప్రభుత్వ పథకాల క్షేత్రస్థాయి అమలు తీరును కూడా బేరీజు వేయనుంది.

**పన్నుల వ్యవస్థలో సంస్కరణలు..**

కస్టమ్స్ సుంకాలు, వస్తు సేవల పన్ను (జీఎస్టీ), ప్రత్యక్ష పన్నుల వ్యవస్థల్లో భవిష్యత్తులో చేపట్టాల్సిన కీలక మార్పులను కమిటీ పరిశీలించనుంది. పన్నుల విధానాలు ప్రభుత్వ ఆదాయం, ఆర్థిక కార్యకలాపాలపై ఏ మేరకు ప్రభావం చూపుతున్నాయనే కోణంలో విశ్లేషించనుంది. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) పనితీరు, ఆర్థిక మార్కెట్ల నియంత్రణ, పెట్టుబడిదారుల ప్రయోజనాలకు భంగం కలగకుండా చూడాల్సిన అంశాలపై దృష్టి సారించనుంది.

**కార్పొరేట్ పాలన.. గణాంకాలపై విశ్లేషణ..**

జాతీయ కంపెనీ చట్ట ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఎదుర్కొంటున్న రోజువారీ సమస్యలు, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల వినియోగం, కంపెనీల ఈ-గవర్నెన్స్, ఆడిటర్ల జవాబుదారీతనాన్ని కమిటీ లోతుగా పరిశీలించనుంది. వీటితో పాటు నీతి ఆయోగ్ అభివృద్ధి ప్రణాళికలు, ఆకాంక్షిత జిల్లాల కార్యక్రమం పనితీరును సమీక్షించనుంది. జాతీయ ఖాతాల గణాంకాల సేకరణ, విశ్లేషణ వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు అవసరమైన మార్గాలను అన్వేషించి, దేశ ఆర్థిక రంగంలో విప్లవాత్మక విధానపరమైన సంస్కరణలకు తగిన సిఫారసులు చేయనుంది.

# గ్రీక్ రెస్టారెంట్‌లో చిగురించిన ప్రేమ!

- రాజీవ్ గాంధీతో తొలి పరిచయాన్ని ఉద్వేగభరితంగా పంచుకున్న సోనియా
- కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో స్నేహితులుగా మొదలైన అందమైన ప్రయాణం
- సోషల్ మీడియా వేదికగా రెండు నిమిషాల పాత జ్ఞాపకాల వీడియో విడుదల
- నవంబర్ 10న పాఠకుల ముందుకు 'బిలాంగింగ్ - ఎ జర్నీ ఆఫ్ లవ్'







**న్యూఢిల్లీ, అక్టోబర్ 24 (సమయం న్యూస్):** కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తన జీవిత భాగస్వామి, దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీతో ఏర్పడిన తొలి పరిచయం, ఆ తర్వాత వారి మధ్య చిగురించిన ప్రేమానుబంధాన్ని తాజాగా అభిమానులతో పంచుకున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లోకి అడుగుపెట్టిన ఆమె.. ఇప్పుడు ఎక్స్ వేదికగానూ తన పాత జ్ఞాపకాలను వెల్లడించారు. తాను స్వయంగా రచించిన 'బిలాంగింగ్ ఉ ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకానికి సంబంధించిన ఓ అందమైన వీడియోను ఈ సందర్భంగా ఆమె విడుదల చేశారు. రాజీవ్ గాంధీతో తన జ్ఞాపకాల సమాహారంగా వస్తున్న ఈ పుస్తకం నవంబర్ 10న పాఠకుల ముందుకు రానుంది.

**ఇటాలియన్ వంటకాల అన్వేషణలో..**

దాదాపు రెండు నిమిషాల నిడివి ఉన్న ఈ వీడియోలో కేంబ్రిడ్జ్‌లో రాజీవ్ గాంధీని తొలిసారి కలిసిన సందర్భాన్ని సోనియా గాంధీ గుర్తుచేసుకున్నారు. అప్పట్లో మంచి ఆహారం దొరికే రెస్టారెంట్ల కోసం తాము వెతికేవారని, ముఖ్యంగా ఇటాలియన్ వంటకాలు తినాలనే ఆసక్తితో అన్వేషించేవారని ఆమె తెలిపారు. అలా ఓ రోజు వర్సిటీ సమీపంలోని ఓ గ్రీక్ రెస్టారెంట్‌కు వెళ్లిన సమయంలోనే రాజీవ్‌తో తొలి పరిచయం ఏర్పడిందని వివరించారు. వారిద్దరూ తొలిసారి కలుసుకున్న ఆ రెస్టారెంట్ పాత చిత్రాలను కూడా ఈ వీడియోలో చూపించడం విశేషం.

**తొలిచూపులోనే ఆకర్షించారు..**

తొలి పరిచయంతోనే రాజీవ్ తనను ఎంతగానో ఆకర్షించారని సోనియా గాంధీ ఉద్వేగభరితంగా వెల్లడించారు. ఆయనతోనే తన జీవితాన్ని పంచుకోవాలనే బలమైన భావన మొదటి సమావేశంలోనే కలిగిందని తెలిపారు. రాజీవ్‌కు కూడా తనపై కచ్చితంగా అలాంటి అభిప్రాయమే ఏర్పడిందని ఆమె పేర్కొన్నారు. ఓ ఉమ్మడి స్నేహితుడి ద్వారా పరిచయమైన తామిద్దరం.. ఆ తర్వాత మంచి స్నేహితులుగా మారామని చెప్పారు. కలిసి పార్టీలకు వెళ్లడం, స్నేహితులతో సరదాగా సమయం గడపడం, వాలెంటైన్స్ డే వేడుకల్లో పాల్గొనడం వంటి మధుర జ్ఞాపకాలను ఆ వీడియోలో నెమరువేసుకున్నారు.

**ఆ సౌమ్యతే నన్ను కట్టిపడేసింది..**

రాజీవ్ గాంధీ వ్యక్తిత్వం ఎంతో ఆకర్షణీయంగా ఉండేదని, ముఖ్యంగా ఆయనలోని సౌమ్యత, సరళత తనను ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయని సోనియా తెలిపారు. ప్రేమ, నవ్వులు, తీయని అనుభూతులతో నిండిన ఓ అందమైన ప్రపంచాన్ని తామిద్దరం కలిసి నిర్మించుకున్నామని ఆమె పేర్కొన్నారు. ఆ అద్భుతమైన జ్ఞాపకాలనే 'బిలాంగింగ్ ఉ ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం ద్వారా పాఠకులతో పంచుకోనున్నట్లు వెల్లడించారు. సోనియా గాంధీ పంచుకున్న ఈ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

# ఢిల్లీలో నివాసం ఉంటున్నట్లు ఆధారాలేవి?

**న్యూఢిల్లీ, అక్టోబర్ 24 (సమయం న్యూస్):** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కో-కన్వీనర్ సౌరవ్ దాస్ ఢిల్లీలో నివాసం ఉంటున్నట్లు ధ్రువీకరించే పత్రాలను సమర్పించాలని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ (ఎస్ఈఎం) కోర్టు ఆదేశించింది. శాంతి బాండ్ దాఖలు ప్రక్రియలో భాగంగా శనివారం జరిగిన విచారణ సందర్భంగా ఆయన నివాసానికి సంబంధించిన ఆధారాలను కోర్టు కోరింది. అయితే, సౌరవ్ దాస్ తరఫున ఎలాంటి అద్దె ఒప్పందం, ఆస్తి పత్రాలు లేదా లీజు డాక్యుమెంట్లను సమర్పించకపోవడాన్ని న్యాయస్థానం గుర్తించింది. నివాస ధ్రువీకరణ పత్రాల పరిశీలన కోసం తదుపరి విచారణను నవంబర్ 17కు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

**జంతర్ మంతర్ వద్ద నిరసనలతో..**

సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలు ఇటీవల షరతులతో కూడిన బెయిల్‌పై విడుదలయ్యారు. అక్టోబర్ 10న శాంతి బాండ్‌పై సంతకాలు చేసిన వీరిద్దరూ, ఆంక్షలు అమల్లో ఉన్నప్పటికీ జంతర్ మంతర్ వద్ద నిరసనలో పాల్గొన్నారని ఆరోపణలు వచ్చాయి. నిబంధనలు ఉల్లంఘించారన్న కారణంతో అక్టోబర్ 13న పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టు వారికి జ్యుడీషియల్ రిమాండ్ విధించగా, ఏడు రోజుల తర్వాత బెయిల్‌పై విడుదలయ్యారు. తాజాగా శనివారం వీరిద్దరూ తమ పూచీకత్తుదారులతో (ష్యూరిటీ) కలిసి కోర్టు విచారణకు హాజరయ్యారు.

**నేహా బోరాకు దక్కని ఊరట..**

మరోవైపు, ఇదే నిరసనలకు సంబంధించిన కేసులో నిందితురాలిగా ఉన్న అఖిల భారత విద్యార్థి సంఘం (ఏఐఎస్ఏ) జాతీయ అధ్యక్షురాలు నేహా బోరాకు ఢిల్లీ హైకోర్టులో ఎలాంటి ఊరట లభించలేదు. శాంతి బాండ్‌పై సంతకం చేయాలంటూ ఎస్ఈఎం కోర్టు జారీ చేసిన ఆదేశాలను సవాల్ చేస్తూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. ఈ నేపథ్యంలో తాను శాంతి బాండ్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ సమర్పించబోనని నేహా బోరా స్పష్టం చేశారు. పౌరుల నిరసనలను అణచివేసేందుకు శాంతి బాండ్లను ఒక సాధనంగా ఉపయోగిస్తున్నారని ఆమె తీవ్రస్థాయిలో ఆరోపించారు.



# భారత శిక్షా స్మృతి సృష్టి కర్త మెకాలే

## భారత్‌లో మెకాలే మెగా సేవలు

## నేడు లార్డ్ మెకాలే జయంతి

లార్డ్ మెకాలే ... ఈ పేరు వినగానే వెంటనే స్ఫురణకు వచ్చేది భారత దేశంలో ఆంగ్ల విద్యకు పునాది వేసిన వ్యక్తి. కానీ చాలా మందికి తెలియని విషయం... మెకాలే భారత శిక్షా స్మృతి (ఇండియన్ పీనల్ కోడ్ 1860) సృష్టికర్త అని. ఆయన లా కమిషన్ ఛైర్మన్ గా నేటికీ చెక్కుచెదరని మూల రూపం గల ఐ పి సి చిత్తు ప్రతి తయారు చేయబడిందని. 19వ శతాబ్దపు కవి, చరిత్రకారుడు, రాజనీతివేత్త, లార్డ్ మెకాలే (థామస్ బాబింగ్టన్ మెకాలే, ఫస్ట్ బేరన్ మెకాలే పి.సి. (1800 అక్టోబరు 25 .. 1859 డిసెంబర్ 28) జయంతి సందర్భంగా, ఇండియన్ పీనల్ కోడ్ పూర్వా పరాలను తెలుసుకుందాం. 1830కి ముందు, భారతదేశంలో, 'ది ఇంగ్లీష్ క్రిమినల్ లా', అనేక చట్ట సవరణలతో, నాటి ప్రెసిడెన్సీ టౌన్లు.. బొంబాయి, కలకత్తా, మద్రాసులలో అమలు జరిగేది. లార్డ్ మెకాలే, నాటి "ఫ్రెంచి పీనల్ కోడ్", "లివింగ్‌స్టోన్స్ కోడ్ ఆఫ్ లూసియానా" అనే రెండు ప్రామాణిక గ్రంథాలను ఆదర్శంగా తీసుకుని, ఇండియన్ పీనల్ కోడ్ 'చిత్తుప్రతి'ని తయారు చేసాడు. భారతీయుల ప్రామాణిక గ్రంథాలైన మనుస్మృతి ని, యాజ్ఞవల్క్య స్మృతిని, నాటి వైదిక పండితుల సలహా, సహాయం కూడా తీసుకున్నాడు. శిక్షల విషయంలో, ఆ నాటి పెద్దలు, పండితులు, రాజులు అభిప్రాయాలను కూడా లెక్కలోకి తీసుకున్నాడు. లార్డ్ మెకాలే మహా మేధావి అయినా, తన అభిప్రాయాల కంటే, నాటి భారత దేశ మత, సాంఘిక, సామాజిక వ్యవస్థలకు, ఆచార వ్యవహారాలకు విలువ ఇచ్చి, వారి అభిప్రాయాలను గౌరవించి, తన మేధస్సుతో 'ఇండియన్ పీనల్ కోడ్' చిత్తుప్రతి తయారు చేశాడు. ఇండియన్ పీనల్ కోడ్ 1837 లోనే నాటి గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా ఇన్ - కౌన్సిల్ కి నివేదించినా, 1860 సంవత్సరం వరకూ అది వెలుగు చూడలేదు.

లార్డ్ మెకాలే తయారుచేసిన 'చిత్తుప్రతి'ని, నాటి ఛీఫ్ జస్టిస్ సర్ బార్నెస్ పీకాక్, కలకతా సుప్రీమ్ కోర్టు న్యాయాధిపతి (ఇతను నాటి లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడు కూడా) సునిశితంగా, సుదీర్ఘంగా, పరిశీలించి, పరీక్షించాడు. అయన సుదీర్ఘ పరిశీలన తర్వాత ఇండియన్ పీనల్ కోడ్ 1860 అక్టోబరు 6 నాడు చట్టసభ ఆమోదం పొందింది. ఇండియన్ పీనల్ కోడ్ మూలాలు 1860 నాటి ఆంగ్లేయుల వలస పాలనలో (బ్రిటిష్ ఇండియా) ఉన్నాయి. 1860 నాటి బ్రిటిష్ ఇండియా చేసిన 45వ చట్టం ద్వారా ఇండియన్ పీనల్ కోడ్ అమలులోకి వచ్చింది. మొట్టమొదటి ఇండియన్ పీనల్ కోడ్ చిత్తుప్రతి 1860 లో, మొదటి లా కమిషన్ అజమా యిషిలో జరిగింది. మొదటి లా కమిషన్ ఛైర్మన్ లార్డ్ మెకాలే (థామస్ బాబింగ్టన్ మెకాలే). మొదటి ఇండియన్ పీనల్ కోడ్ 1862 సంవత్సరంలో, అమలులోకి వచ్చింది. నాటినుంచి ప్రపంచం లోను, భారతీయ సమాజాల లోను, విద్యాపరంగా, వైజ్ఞానికంగా, అనేక రంగాలలో,అనేక రకాలుగా జరిగిన సమస్తమైన మార్పుల ప్రాతిపదికగా భారతీయ శిక్షాస్మృతి అనేకమైన మార్పులు, చేర్పులకు గురి అవుతూ, నేటి రూపాన్ని పొందింది. అందుకు గృహ హింస సెక్షన్ 498-ఎ ఒక ఉదాహరణగా తీసుకో వచ్చు. మన భారతీయ శిక్షాస్మృతిలో 511 సెక్షన్లు ఉన్నాయి. వరకట్నం చట్టాలు మరో ఉదాహరణ. వరకట్న సమస్య, ఐరోపా, అమెరికా దేశాలలో లేదు కాబట్టి, వరకట్న చట్టాలు, శిక్షలు వారి శిక్షాస్మృతిలో లేవు.

పాకిస్తాన్ స్వాతంత్ర్యం పొందిన తర్వాత, ఇండియన్ పీనల్ కోడ్ ను యధాతథంగా పాకిస్తాన్ తన దేశంలో అమలు చేసింది. దాని పేరు "పాకిస్తాన్ పీనల్ కోడ్" (పి.పి.సి). బంగ్లాదేశ్ కూడా "బంగ్లాదేస్ పీనల్ కోడ్" పేరుతో అమలు చేసింది. బ్రిటిష్ వలస దేశాలైన, మియన్మార్ (నాటి బర్మా), శ్రీలంక (నాటి సిలోన్), మలేసియా, సింగపూర్, బ్రూనీ దేశాలు కూడా ఇండియన్ పీనల్ కోడ్ ను యధాతథంగా అమలు చేస్తున్నాయి. ఇండియన్ పీనల్ కోడ్ జమ్ము కాశ్మీర్లో కూడా అమలులో ఉంది. కానీ, ఈ రాష్ట్రంలో ఇండియన్ పీనల్ కోడ్ అనరు. "రన్‌బీర్ పీనల్ కోడ్" (ఆర్.పి.సి) అని పిలుస్తారు. ఇండియన్ పీనల్ కోడ్ సృష్టికర్త లార్డ్ మెకాలే, 1859 డిసెంబరు 28 న, తన 59వ ఏట, మరణించిన క్రమంలో తన కృషి సాకారమై , చట్టమై, అమలు జరగటం చూడనే లేదు. నాటి ఇండియన్ పీనల్ కోడ్ చిత్తుప్రతి, మూల రూపం, నేటికీ చెక్కు చెదరలేదు. దీనిమీద కొన్ని విమర్శలు ఉన్నప్పటికీ, ఈ నాటికీ, న్యాయశాస్త్రంలో, దీనికి తిరుగు లేదు. 162 ఏళ్లల్లో మార్పులు ఎన్ని వచ్చినా, శిక్షాస్మృతి చెక్కు చెదరకుండా ఉన్నది అంటే, మెకాలే దూరదృష్టి అమోఘం. మేధస్సు అద్భుతం. ఆయన కృషి అనితర సాధ్యం.




రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ఆదరణ కరువైన తోలుబొమ్మలాట

## నేడు అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం

సినిమాలు, టి.వి.లు లేని రోజుల్లో వృత్తి కళాకారుల ప్రదర్శనలకు ప్రజలు బ్రహ్మరథం పట్టేవారు. అలిసి పోయిన పల్లె ప్రజలకు జానపదుల ప్రదర్శనలు సేదతీర్చేవి. గ్రామాల్లో జానపద కళాకారులు వివిధ రకాలైన ప్రదర్శనలు ఇచ్చేవారు. ముందు తరాలవి శ్రమైక జీవన విధానం. కష్టజీవులే ఎక్కువ మంది. రోజంతా కాయకష్టం చేసి ఇళ్లకు చేరిన వారి అలసట తీర్చి వారికి సాంత్వన చేకూర్చే కళా రూపాలే జనపదాలు. అలాంటి వాటిలో తోలు బొమ్మలాట ప్రధాన మైనది.



తోలు బొమ్మలాట ఒక జానపద కళారూపం. తాను స్వయంగా అనుకరించలేని జానపదుడు కావ్యాల్లోనూ, పురాణాల్లోను వర్ణింపబడిన పాత్రల ఆహార్య విశేషాలను స్వయంగా సృష్టించు కున్నాడు. తన భాషతో ఆ మూగ చిత్రాలకు ప్రాణం పోశాడు. రకరకాల విన్యాసాలను వాటి చేత చేయించాడు. తాను స్వయంగా వెనుకనుండి ఈ పాత్రలను కదిలించాడు. కదులుతున్న ఆ జీవంలేని బొమ్మలతో జీవ నిబద్ధమైన ఒక దృశ్యాన్ని ప్రదర్శించడం లోనే జానపదుడి కళాత్మకత దాగి ఉంది. సుసంపన్న మైన హిందూ ఇతిహాసాలను తెర మీదకి తెచ్చిన ఒక గొప్ప ప్రక్రియ తోలు బొమ్మలాట. ఒక సామూహిక సంగీత, నాట్య ప్రదర్శన కళారూపమైన తోలు బొమ్మలాట, జానపదుని మొదటి రంగస్థల ప్రదర్శన కళారూపాన్ని గుర్తించ వచ్చు. పూర్వం రాజాస్థానాల లోని పండితులు తమ ప్రభువులను సంతోష పెట్టడానికి బొమ్మలను తయారు చేసి మానవులుగా నటింపచేస్తే సృజనాత్మకంగా ఉంటుందని భావించి తోలు బొమ్మలను తయారుచేసి, తెల్లటి పంచెను తెరగా అమర్చి, దానిపైన దీపం కాంతిలో బొమ్మల నీడలను పడేటట్లు చేసి బొమ్మలాటను ప్రదర్శించేవారు. ఈ విధంగా తోలు బొమ్మలాట పుట్టిందని, ఈ ఆట పండితుల చేత మెరుగులు దిద్దుకున్నదని, చెప్పడానికి అమర కోశం లోని శ్లోకాలను నిదర్శనంగా పేర్కొనవచ్చు.

మహా భారతంలో తోలు బొమ్మలాట ప్రస్తావన ఉంది. భగవద్గీతలో సత్వ, తమో, రజో గుణాలు మూడు దారాలని, అవి పరమాత్ముని చేత మానవ జీవన గమనంలో లాగబడు తుంటాయని చెప్పబడింది. మానవుడు బొమ్మ అయితే అతనికున్న సూత్రాలు ఈ మూడు గుణాలు. ఆడించేవాడు జగన్నాటక సూత్రధారి అన్న అర్థంలో ఉన్న ఈ భాగం తోలు బొమ్మలాటలకు సంబంధించిన ప్రస్తావన. భారతీయ జానపద ప్రదర్శన కళల్లో అతి ప్రాచీనమైన



దృశ్య రూపకానికి చెందినది తోలు బొమ్మలాట. క్రీ.పూ 3 వ శతాబ్దం నాటికే తెలుగు దేశంలో తోలు బొమ్మలాట ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తోంది. చరిత్రకారుల ప్రకారం తోలు బొమ్మలు క్రీ.పూ 2500 సం.నకు పూర్వం, పురాతన నాగరికత అయిన హరప్పా, మొహంజోదారో కొన్ని వేల కిలోమీటర్ల వరకూ వ్యాపించినట్లు చెపుతారు. క్రీ.పూ 3 వ శతాబ్దానికి చెందిన అశోకుని శిలా శాసనాల్లో జంబూ ద్వీపానికి బొమ్మలాట ప్రదర్శన రంగంగా ఆపాదించారు. పతంజలి మహాభాష్యంలో తన కాలపు వినోద సాధనాలను వివరిస్తూ మూడు ప్రధానమైన వాహికలను వివరిస్తూ వాటిలో బొమ్మలాట ఒక ప్రధనమైన వాహిక అని వివరించారు. తేరి గాథ అను బౌద్ధ గ్రంథంలో బొమ్మలాటకు సంబంధించిన ప్రస్తావన ఉంది. వాత్సాయనుని కామసూత్రాల్లో బొమ్మలలోని రకాలు, బొమ్మలాటల్లోని తేడాలు చర్చింప బడినాయి. కన్యలను ఆకర్షించడానికి బొమ్మలాటల ప్రదర్శన అవసరమని వాత్సాయనుని వివరణ. నాటకానికి, తరువాత పరోక్షంగా తోలుబొమ్మలాట సినిమాకు మూలమైంది. కదలికలోని ఆనందం కనుక్కున్న మనిషి ఆలోచనలో నుండి పుట్టిందే బొమ్మలాట. స్థిరత్వం నుండి చలనం వైపుకు పయనించడంలో భాగంగా ప్రాచీన మానవుడు బొమ్మలాటను సృష్టించు కున్నాడు. కథ చెప్పడం మొదలైన తరువాత ఆ కథలోని పాత్రలు తెరమీద కనిపిస్తే, నటిస్తే చూడాలన్న జనపదుడి తపనలో నుండి బొమ్మలాట పుట్టింది. బొమ్మలతో ఆడుకోవడం అతి ప్రాచీన కళ. కొయ్యబొమ్మ లాటలు, కట్టెబొమ్మ లాటలు, తొడుగు బొమ్మలాటలు, తళ్ళబొమ్మ లాటలు, బుట్టబొమ్మ లాటలు, తోలుబొమ్మ లాటలు అని బొమ్మలాటలు అనేకము ఉన్నాయి. రంగస్థలంపై పొడవాటి గుంజలపై తెల్లటి వస్త్రాన్ని లేదా పంచెను ముందు భాగంలో గట్టిగా లాగి కడతారు. తెర భూమి నుండి నిలువుగా ఉండకుండా కొంచెం ఏటవాలుగా కడతారు. ఈ విధంగా కట్టడం వల్ల బొమ్మలను ఆడించే టప్పుడు బొమ్మలకు కాళ్ళు అడ్డు తగలకుండా ఉంటుంది. తోలు బొమ్మల ప్రతిబింబాలు సరిగ్గా తెరపై పడడానికి తెరలోపలి నుండి పూర్వం కాగడాలు ఉపయోగించేవారు. విద్యుత్ సౌకర్యం అభివృద్ధి చెందిన తర్వాత ఎక్కువ కాంతిని ఇచ్చే విద్యుత్ బల్బులను వాడుతున్నారు. ప్రదర్శన సంబంధమైన కదలికలకు అనుగుణంగా ప్రధాన గాయకుడు పాడుతూ వుంటే, మిగిలిన వారు వంతలుగా పాడుతారు. వంతల్లో స్త్రీలు ప్రధానంగా ఉంటారు. రాగం తీయడం, ముక్తాయింపు, సంభాషణ ధోరణిలో స్త్రీగొంతు ముఖ్యపాత్ర వహిస్తుంది. స్త్రీ పాత్రలకు స్త్రీలే పాడతారు. తోలు బొమ్మలాటలో సామాజిక స్థితిగతులకు దర్పణంగా నిలిపి, పాత్రల ద్వారా సమాజంలో ఉండే దురాచారాలను, మూఢ నమ్మకాలను ఎండగడతారు. ఇందులో సామెతలు, లోకోక్తులు, పొడుపు కథలు, నీతికథలు మొదలైనవి చోటు చేసుకుంటాయి. అదేవిధంగా అభినయాలకు స్వభావానుగుణంగా తేల్చడానికి వాద్యానికి సంబంధించి హార్మోనియం, తాళాలు, తొక్కుడుబిళ్ల, మద్దెల, డప్పు, గజ్జెలు వంటివి ప్రధాన భూమికను నిర్వహిస్తాయి. తోలు బొమ్మల ప్రదర్శనలో రామాయణం, భారతం లకు సంబంధించిన కథా వస్తువులు ఉంటాయి. లంకా దహనం, సతీసులోచన, యయాతి, అంగద రాయబారం, మైరావణ వధ, విరాటపర్వం, పద్మవ్యూహం, ఉత్తర గోగ్రహణం వంటి కథలతో తోలు బొమ్మలను ప్రదర్శిస్తారు. తోలు బొమ్మలు ఆంధ్ర రాష్ట్రంలో ప్రాచీన ఓడరేవులైన కళింగపట్నం, భీమునిపట్నం, కోరంగి, మచిలీపట్నం, వాడరేవు, కొత్తపట్నాల నుంచి విదేశాలకు భారతీయులతో పాటు వెళ్ళాయి. పర్షియా, టర్కీ ల మీదుగా గ్రీసు దేశంలో ప్రవేశించిన తోలుబొమ్మలు, గ్రీసులో నూతన రూపం సంతరించుకుని ఉత్తరాఫ్రికా లోని ముస్లిం దేశాలకు, 17వ శతాబ్దంలో ఇటలీకి, అక్కడినుండి ఫ్రాన్స్ లోని వెర్సయిల్స్, పారిస్, పేలేరాయల్ నగరాలకు వ్యాపించాయి. తోలు బొమ్మలు కాలానుగుణంగా ఆయాదేశాల్లో భిన్నరూపాలు ధరించినప్పటికీ, భారతదేశం వీటికి మాతృక అని చెపుతారు. తోలుబొమ్మల ఆటలు క్రమేపీ కనుమరుగు కాక తప్పని స్థితి నెలకొంది. తోలు బొమ్మల కళారూపం అంతరించి పోవడానికి గల కారణం నాటకాల ప్రభావం ఉధృతంగా ఉండడం, పద్యనాటకాల ప్రాధాన్యత పెరగడం, నాటకాలలో శాస్త్రీయతకు, సాంకేతిక పరిజ్ఞానానికి ఉన్నతస్థానం లభించడం, సినిమాలు ప్రజలను సమ్మోహితులను చేయడం, తెరపై ప్రేక్షకులకు కావలసినవి అందించడం, అదేవిధంగా ఇంట్లోనే జనరంజకం అన్న నేపథ్యంలో విస్తృతంగా ఛానల్స్ వచ్చి ప్రపంచ తీరు తెన్నులను మార్చడం వంటి ఎన్నో కారణాలు తోలుబొమ్మలు లాంటి కళారూపాల మనుగడకు సవాలుగా నిలిచాయి. ఇలాంటి విషమ పరిస్థితుల్లో, మన ప్రాచీన కళా రూపాల ఆనవాళు ళ్ అని చెప్పడానికి వాటిని బ్రతికించు కోవలసిన అవసరం ఎంతైనా అవసరం.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# తెలంగాణకే తలమానికమైన ధర్మపురి నాటక సంస్థ

## నేడు ప్రపంచ కళాకారుల దినోత్సవం

తెలంగాణ సాంస్కృతిక చరిత్రలో ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ నాట్యమండలికి ప్రత్యేక స్థానం ఉంది. గోదావరి తీరాన వెలసిన ఈ పుణ్యక్షేత్రంలో 1936లో ప్రారంభమైన నాటక సంస్థ తొమ్మిది దశాబ్దాలుగా కళామతల్లికి సేవలందిస్తోంది. మూడు తరాల కళాకారులను రంగస్థలానికి పరిచయం చేస్తూ పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాలతో తెలంగాణలోని అనేక ప్రాంతాల ప్రజల అభిమానాన్ని చూరగొంది. నిజాం పాలనలో తెలుగు భాషా సాహిత్యాలకు తగిన ప్రోత్సాహం లేని పరిస్థితుల్లో స్థానిక కళాభిమానులు, దాతల సహకారంతో ఈ సంస్థ ఆవిర్భవించింది. కాసర్ల వెంకట రాజయ్య శిక్షణ, దర్శకత్వంలో 'సతీ సావిత్రి' నాటకంతో ప్రదర్శనలకు శ్రీకారం చుట్టింది. అనంతరం ద్రౌపది వస్త్రాపహరణం, భక్త ప్రహ్లాద, శ్రీకృష్ణ తులాభారం, లవకుశ, భక్త రామదాసు, సతీ సక్కుబాయి, శ్రీకృష్ణ రాయబారం, పాండవోద్యోగం వంటి సుమారు పాతిక పౌరాణిక నాటకాలను ప్రదర్శించింది. తొలి తరం కళాకారుల్లో కాకెరి లక్ష్మీకాంతశాస్త్రి, రొట్టె చంద్రశేఖరశాస్త్రి, సంగనభట్ల మాణిక్యశాస్త్రి, చాచం కృష్ణయ్య, జగన్నగారి విశ్వనాథశాస్త్రి, స్త్రీ పాత్రధారి దెమ్మ బాలకృష్ణయ్య ప్రత్యేక గుర్తింపు పొందారు. 1946లో మాజీ మంత్రి కె.వి. కేశవులు చొరవతో మంచిర్యాలలో జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్తు మహాసభల్లో 'శ్రీకృష్ణ తులాభారం' నాటకాన్ని ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను వీక్షించిన సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు, నార్ల వెంకటేశ్వరరావు కళాకారులను అభినందించారు. అనంతరం దేవులపల్లి రామానుజరావు, కాళోజీ నారాయణరావు, పీవీ నరసింహారావు, స్థానం నరసింహారావు వంటి ప్రముఖుల ప్రశంసలను కూడా సంస్థ అందుకుంది. ఆ రోజుల్లోనే సొంత ప్రదర్శనశాల, ప్రత్యేక దృశ్య పరదాలు, కిరీటాలు, అలంకరణ సామగ్రితో నాటకాలను అట్టహాసంగా నిర్వహించేవారు. కశోజ్జల శివరామయ్య పర్యవేక్షణలో అద్భుత రంగస్థల విన్యాసాలను ప్రదర్శించేవారు. రెండో తరం కళాకారులు నాటక ప్రదర్శనలతోపాటు సంస్కృతాంధ్ర డిగ్రీ కళాశాల ప్రారంభానికి నిధుల సేకరణలోనూ భాగస్వాములయ్యారు. దాదగారి కిషన్‌రావు నిర్వహణలో రొట్టె విశ్వనాథశాస్త్రి, గుండయ్యశాస్త్రి,



పెండ్యాల శంకర్, ఓజ్జల రామచంద్రం, నరసింహాచారి, గుండి హనుమాన్లు, భోగం పురుషోత్తం వంటి కళాకారులు 'గయోపాఖ్యానం' నాటకాన్ని పలు ప్రాంతాల్లో ప్రదర్శించారు. మూడో తరం కళాకారులు వీరపాండ్య కట్టబొమ్మన, వీర కాపయ, నాగమ నాయకుడు వంటి చారిత్రక నాటకాలకు ప్రాధాన్యం ఇచ్చారు. 1984, 1991 సంవత్సరాల్లో కరీంనగర్ కళాభారతిలో ప్రదర్శనలు ఇచ్చి బహుమతులు అందుకున్నారు. 1989లో సూర్యాపేటలో 'కట్టబొమ్మన', 2016లో వరంగల్ వేణుమాధవ్ ఆడిటోరియం, హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రదర్శనలు నిర్వహించారు. డాక్టర్ సంగనభట్ల నరసయ్య, కొరిడె నరహరిశర్మ, కాకెర్ల దత్తాత్రేయ, ఎస్. రామకృష్ణయ్య, మునిగాల కిషన్ తదితరులు నాటకరంగంలో విశేష గుర్తింపు పొందారు. 1993లో తెలుగు విశ్వవిద్యాలయం సహకారంతో నిర్వహించిన వేడుకల్లో 'గయోపాఖ్యానం' ప్రదర్శించి కళాకారులను సన్మానించారు. 1955లో ఆంధ్ర నాటక పరిషత్తు, 1983లో ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ సంస్థ కళాకారులను సత్కరించాయి. డాక్టర్ సంగనభట్ల నరసయ్యకు గ్రామీణ కళాజ్యోతి పురస్కారం లభించింది. 2017 ఏప్రిల్ 2, 3 తేదీల్లో నిర్వహించిన ఎనభై వసంతాల వేడుకలకు కె.వి. రమణాచారి, కొప్పుల ఈశ్వర్, బి.ఎస్. రాములు తదితరులు హాజరయ్యారు. ప్రస్తుతం నరహరిశర్మ ఆధ్వర్యంలో, సంగనభట్ల నరసయ్య పర్యవేక్షణలో, కాకెర్ల దత్తాత్రేయ నిర్వహణలో నాట్యమండలి కళాప్రస్థానం కొనసాగుతోంది. రామకిష్టయ్య, చంద్రమౌళి, వెంకటరమణ, కిశోర్, మహేందర్, సురేశ్, బాలకృష్ణ, శేఖర్, నర్సింహమూర్తి, జన్మంచి నరసయ్య, వంశీకృష్ణ, నరహరి, అమర్, అనిల్, శ్రీనివాస్, రాంకిషన్‌తోపాటు కాకెరి అరుణ, సంగనభట్ల ప్రతిభ ప్రదర్శనల్లో భాగస్వాములవుతున్నారు. ఆధునిక వినోద మాధ్యమాల ప్రభావంతో సంప్రదాయ నాటకాలకు ఆదరణ తగ్గుతున్న నేపథ్యంలో వృద్ధ కళాకారులకు పింఛన్లు, నాటక ప్రదర్శనలకు ఆర్థిక ప్రోత్సాహం, యువతకు శిక్షణ వంటి చర్యలు ప్రభుత్వం చేపట్టాల్సిన అవసరం ఉంది. తొమ్మిది దశాబ్దాలుగా పద్య నాటక సంప్రదాయాన్ని పరిరక్షిస్తున్న ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ నాట్యమండలి తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి నిలువెత్తు ప్రతీకగా నిలుస్తోంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# భారత్‌కు విజయ 'తిలకం'..

**చివరి ఓవర్లలో అద్భుతం చేసిన తిలక్ వర్మ, నితీశ్ రెడ్డి**

- రెండో టీ20లోనూ టీమిండియా అద్భుత విజయం
- న్యూజిలాండ్ 20 ఓవర్లలో 180/5 స్కోరు
- గ్లెన్ ఫిలిప్స్ 70, బెవాన్ జాకబ్స్ 58 పరుగులు
- అర్ష్‌దీప్ సింగ్ ఖాతాలో రెండు వికెట్లు
- లక్ష్య ఛేదనలో భారత టాప్ ఆర్డర్ తడబాటు



**క్రైస్ట్‌చర్చ్, అక్టోబర్ 24 :**
టీమిండియాకు ఓటమి తప్పదనుకున్న వేళ తెలుగు కుర్రాళ్లు అదరగొట్టారు. ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డితో కలిసి భారత వైస్ కెప్టెన్ తిలక్ వర్మ అద్భుతం చేశాడు. చివరి ఓవర్లలో మెరుపు బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పి న్యూజిలాండ్‌పై టీమిండియాకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. క్రైస్ట్‌చర్చ్‌లోని హాగ్లీ ఓవల్ వేదికగా శనివారం జరిగిన రెండో టీ20లో న్యూజిలాండ్ నిర్దేశించిన 181 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత జట్టు మధ్యలో తడబడినా.. తిలక్, నితీశ్ పోరాటంతో విజయాన్ని అందుకుంది. టాస్ గెలిచిన భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బౌలింగ్ ఎంచుకున్నాడు. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 180 పరుగులు చేసింది. ఆరంభంలో భారత బౌలర్లు పైచేయి సాధించారు. టిమ్ సీఫెర్ట్ (7), డారిల్ మిచెల్ (6), ఫిన్ అలెన్ (16) త్వరగా వెనుదిరిగారు. అర్ష్‌దీప్ సింగ్ రెండు వికెట్లు తీయగా.. ప్రిన్స్ యాదవ్, భువనేశ్వర్ కుమార్, నితీశ్ కుమార్ రెడ్డి చెరో వికెట్ పడగొట్టారు. అయితే గ్లెన్ ఫిలిప్స్, బెవాన్ జాకబ్స్ భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నారు. ఫిలిప్స్ 43 బంతుల్లో 70 పరుగులు చేయగా, జాకబ్స్ 46 బంతుల్లో 58 పరుగులతో రాణించాడు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 116 పరుగులు జోడించి న్యూజిలాండ్‌ను పటిష్ఠ స్థితికి చేర్చారు. చివర్లో మైకేల్ బ్రేస్‌వెల్ రెండు బంతుల్లోనే 10 పరుగులు చేయడంతో ఆతిథ్య జట్టు 180 పరుగుల స్కోరు సాధించింది. 181 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. సంజూ శాంసన్ (14), వైభవ్ సూర్యవంశీ (4) త్వరగా ఔటయ్యారు. అభిషేక్ శర్మ (27), శ్రేయస్ అయ్యర్ (7) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు. దీంతో భారత్ పరుగుల కోసం ఇబ్బంది పడింది. కీలక సమయంలో వికెట్లు కోల్పోవడంతో మ్యాచ్ న్యూజిలాండ్ చేతుల్లోకి వెళ్లినట్లు కనిపించింది. ఆ సమయంలో తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి (26 నాటౌట్) బాధ్యత తీసుకున్నారు. తిలక్ (51 నాటౌట్: 6 ఫోర్లు, 1 సిక్స్) తనదైన శైలిలో బౌండరీలు బాదుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించగా, నితీశ్ భారీ షాట్లతో అతడికి అండగా నిలిచాడు. చివరి ఓవర్లలో వీరిద్దరి దూకుడుతో భారత్ విజయానికి చేరువైంది. చివరి ఓవర్‌కు ముందు 10 పరుగులు అవసరమైన దశలోనూ ఒత్తిడికి లోనుకాకుండా ఆడిన ఈ జోడీ లక్ష్యాన్ని అందుకుంది. ఈ విజయంతో భారత్ ఐదు టీ20ల సిరీస్‌లో 2-0 ఆధిక్యాన్ని అందుకుంది. తొలి మ్యాచ్‌లోనూ న్యూజిలాండ్ నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని ఛేదించిన టీమిండియా, రెండో మ్యాచ్‌లోనూ ఒత్తిడిని తట్టుకుని గెలవడం విశేషం. కీలక సమయంలో తెలుగు కుర్రాళ్లు తిలక్ వర్మ చూపిన పోరాటం, నితీశ్ రెడ్డి ఇచ్చిన సహకారం భారత విజయానికి ప్రధాన బలంగా నిలిచాయి.



# పాకిస్థాన్‌లో మహిళల టీ20 వరల్డ్ కప్..

**దుబాయ్‌లో భారత్ వర్సెస్ పాక్ మ్యాచ్!**

**లాహోర్, అక్టోబర్ 24 :**
2028 మహిళల టీ20 వరల్డ్ కప్ నిర్వహణపై ఆసక్తికర అప్‌డేట్ వెలువడింది. ఈ టోర్నమెంట్‌ను పాకిస్థాన్ పూర్తిగా తమ దేశంలోనే నిర్వహించాలని చూస్తుండగా, భారత్ ఆడే మ్యాచ్‌లకు మాత్రం యూఏఈ (దుబాయ్) వేదిక కానుంది. 2028 సెప్టెంబర్ 7 నుంచి అక్టోబర్ 1 వరకు జరగబోయే ఈ టోర్నమెంట్‌కు పాకిస్థాన్ మెయిన్ హోస్ట్‌గా వ్యవహరించనుంది. అయితే భారత్-పాకిస్థాన్ మధ్య ఉన్న రాజకీయ పరిస్థితుల కారణంగా గతంలో కుదిరిన హైబ్రిడ్ మోడల్ నిబంధనలే వర్తిస్తాయని ఐసీసీ స్పష్టం చేయడంతో.. భారత జట్టు ఆడే మ్యాచ్‌లను దుబాయ్‌కి మార్చాలని పీసీబీ భావిస్తోంది. భారత్ మ్యాచ్‌లు మినహా గ్రూప్ దశలోని మిగతా మ్యాచ్‌లు, నాకౌట్ మ్యాచ్‌లన్నింటినీ పాకిస్థానే నిర్వహించనుంది. ఒకవేళ ఫైనల్ చేరే జట్లలో భారత్ లేకపోతే లాహోర్‌లోనే ఫైనల్ నిర్వహించాలని యోచిస్తున్నారు. దీనిపై ఐసీసీ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. గతంలో 2025 చాంపియన్స్ ట్రోఫీ, 2023 ఆసియా కప్ వంటి టోర్నీల్లోనూ ఇదే హైబ్రిడ్ ఫార్ములాను అమలు చేసిన విషయం తెలిసిందే.

# ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో పీవీ సింధు

- మరో సూపర్ 750 టైటిల్‌పై కన్ను
- మూడు గేమ్‌ల పోరులో జపాన్ షట్లర్‌పై విజయం
- 38 షాట్ల ర్యాలీతో మ్యాచ్‌లో కీలక మలుపు
- ఫైనల్లో అన్ సే-యంగ్‌తో టైటిల్ పోరు

## రెండో గేమ్ కోల్పోయినా పుంజుకున్న భారత స్టార్




**పారిస్, అక్టోబర్ 24 :**
భారత స్టార్ షట్లర్, రెండుసార్లు ఒలింపిక్ మెడలిస్ట్ పీవీ సింధు ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో జరుగుతున్న ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ 750 టోర్నీలో ఫైనల్‌కు దూసుకెళ్లారు. శనివారం (అక్టోబర్ 24) జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో ప్రపంచ 22వ ర్యాంకర్, జపాన్ క్రీడాకారిణి హీనా అకేచిపై సింధు అద్భుత విజయం సాధించారు. గంటా 13 నిమిషాల పాటు ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో 21-10, 20-22, 21-16 తేడాతో విజయం సాధించి, ఈ ఏడాది తన రెండో సూపర్ 750 ఫైనల్‌లో అడుగుపెట్టారు. గత జులైలో జపాన్ ఓపెన్ టైటిల్ నెగ్గిన సింధుకు ఇది ఈ ఏడాది మరో పెద్ద విజయం.

### తొలి గేమ్‌లో సింధు ఏకపక్ష ఆధిపత్యం

తొలి గేమ్ ప్రారంభంలో ఇరు క్రీడాకారిణులు హోరాహోరీగా తలపడటంతో స్కోరు 4-4, 8-8తో సవ-ంమైంది. ఆ తర్వాత లయ అందుకని 11-9 ఆధిక్యంతో విరామానికి వెళ్లిన భారత స్టార్, ఆ తర్వాత ఊహించని రీతిలో చెలరేగిపోయారు. కేవలం 18 నిమిషాల్లోనే వం-సగా 12 పాయింట్లలో 11 పాయింట్లు ఖాతాలో వేసుకుని 21-10 తేడాతో తొలి గేమ్‌ను సునాయసంగా కైవసం చేసుకున్నారు.

### రెండో గేమ్‌లో జపాన్ క్రీడాకారిణి బలమైన కంబాక్

రెండో గేమ్‌లో మాజీ ప్రపంచ ఛాంపియన్ సింధుకు గట్టి పోటీ ఎదురైంది. మొదట్లో నాలుగు పాయింట్లు వెనుకబడినప్పటికీ, సింధు తిరిగి పుంజుకుని స్కోరును 7-7తో సమం చేశారు. తన పవర్ ఫుల్ షాట్లు, క్రాస్ కోర్ట్ దాడులతో స్కోరును 14-14, 16-16తో రసవత్తరంగా మార్చారు. అయితే, ఆఖరి నిమిషాల్లో జపాన్ షట్లర్ తీవ్రంగా పోరాడి గేమ్ పాయింట్ సాధించింది. మొదటి గేమ్ పాయింట్‌ను సింధు కాపాడుకున్నప్పటికీ, ఆ తర్వాత చేసిన చిన్న పొరపాటుతో రెండో గేమ్‌ను 20-22తో అకేచి కైవసం చేసుకుంది.

### నిర్ణయాత్మక మూడో గేమ్.. 38 షాట్ల ర్యాలీతో మ్యాచ్ తిరిగిన మలుపు

ఫైనల్ బెర్తును తేల్చే మూడో గేమ్ తీవ్ర ఉత్కంఠ నడుమ సాగింది. 5-3 ఆధిక్యంతో నిలిచిన సింధును జపాన్ క్రీడాకారిణి నెట్ ప్లేతో గట్టి సవాల్ విసిరి స్కోరును 15-15తో సమం చేసింది. అయితే, మ్యాచ్‌కు అసలైన మలుపు తిరిగింది 18-16 వద్ద జరిగిన సుదీర్ఘమైన 38 షాట్ల ర్యాలీతోనే! అకేచి చేసిన నెట్ ఎర్రర్ వల్ల ఈ పాయింట్ సింధు ఖాతాలో పడింది. అదే ఉత్సాహంతో సింధు వరుస పాయింట్లు సాధించి 4 మ్యాచ్ పాయింట్లు సాధించారు. ఆఖరిగా పవర్ ఫుల్ క్రాస్ కోర్ట్ స్మాష్‌తో గేమ్‌ను 21-16తో ముగించి ఫైనల్ పిలుపు అందుకున్నారు.

### ఫైనల్లో ప్రపంచ నంబర్ 1 అన్ సే-యంగ్ తో పోరు..

ఆదివారం జరగనున్న టైటిల్ పోరులో ప్రపంచ నంబర్ వన్, దక్షిణ కొరియా స్టార్ షట్లర్ అన్ సే-యంగ్‌తో సింధు తలపడనున్నారు. ఫైనల్ మ్యాచ్‌పై సింధు స్పందిస్తూ.. "ఫైనల్‌కు చేరుకోవడం సంతోషంగానే ఉంది, కానీ పని ఇంకా పూర్తి కాలేదు. ఫైనల్‌పై దృష్టి సారించాల్సి ఉంది. ఆమె ప్రస్తుతం అత్యుత్తమ ఫామ్‌లో ఉంది. గతంలో మేము చాలాసార్లు తలపడ్డాం. రేపు సరికొత్త రోజు, ప్రతి పాయింట్ ముఖ్యం. మైదానంలో నా అత్యుత్తమ ప్రదర్శన ఇస్తూ ఆమెకు గట్టి పోటీ ఇస్తాను" అని స్పష్టం చేశారు. గాయాలు, ఫామ్ లేమితో ఇబ్బంది పడిన సమయం నుంచి కోలుకోవడానికి కొత్త సపోర్ట్ టీమ్, శిక్షణ పద్ధతుల్లో చేసిన మార్పులు ఎంతగానో ఉపయోగపడ్డాయని సింధు ఈ సందర్భంగా వెల్లడించారు.



# అర్ష్‌దీప్ సింగ్ సరికొత్త రికార్డ్..

**భువనేశ్వర్‌ను అధిగమించిన యువ పేసర్!**

**ఒకే ఏడాదిలో అత్యధిక టీ20 వికెట్లు తీసిన భారత బౌలర్‌గా అర్ష్‌దీప్**

**భువనేశ్వర్ కుమార్ 37 వికెట్ల రికార్డును అధిగమించిన పంజాబ్ పేసర్**

**2026లో ఇప్పటివరకు 38 వికెట్లు పడగొట్టిన అర్ష్‌దీప్ సింగ్**

**న్యూజిలాండ్‌తో రెండో టీ20లో ఈ అరుదైన ఘనత సాధన**

**క్రైస్ట్‌చర్చ్, అక్టోబర్ 24:**
భారత యువ ఎడమచేతి వాటం పేసర్ అర్ష్‌దీప్ సింగ్ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో ఒకే క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన భారత బౌలర్‌గా సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఈ క్రమంలో సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ పేరిట ఉన్న రికార్డును అతను అధిగమించాడు. న్యూజిలాండ్‌తో శనివారం హేగ్లీ ఓవల్ మైదానంలో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో ఈ ఘనతను అందుకున్నాడు. ఈ మ్యాచ్‌లో అర్ష్‌దీప్ సింగ్ 33 పరుగులిచ్చి 2 కీలక వికెట్లు తీశాడు. దీంతో 2026 క్యాలెండర్ సంవత్సరంలో అతని వికెట్ల సంఖ్య 38కి చేరింది. ఇంతకుముందు ఈ రికార్డు భువనేశ్వర్ కుమార్ పేరిట ఉండేది. భువనేశ్వర్ 2022 సీజన్ లో 37 వికెట్లు తీశాడు. విశేషమేమిటంటే, భువీ 31 ఇన్నింగ్స్‌లలో ఈ ఘనత సాధించగా, అర్ష్‌దీప్ కేవలం 26 ఇన్నింగ్స్‌లలోనే ఈ మార్కును దాటడం అతని నిలకడకు నిదర్శనం. ఈ మ్యాచ్‌లో తొలుత టిమ్ సీఫర్ట్‌ను ఔట్ చేసి న్యూజిలాండ్‌కు తొలి దెబ్బతీసిన అర్ష్‌దీప్, ఆ తర్వాత ప్రమాదకరంగా మారుతున్న గ్లెన్ ఫిలిప్స్ (70) వికెట్‌ను కూడా పడగొట్టి రికార్డును సొంతం చేసుకున్నాడు. ఒక దశలో 41 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన కివీస్‌ను, గ్లెన్ ఫిలిప్స్, బెవాన్ జాకబ్స్ (58) నాలుగో వికెట్‌కు 116 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకున్నారు. దీంతో న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 180 పరుగులు చేయగలిగింది. ఈ ప్రదర్శనతో, ఒక క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక టీ20 వికెట్లు తీసిన ప్రపంచ బౌలర్ల జాబితాలో అర్ష్‌దీప్ మూడో స్థానానికి చేరాడు. ఐర్లాండ్‌కు చెందిన జాష్ లిటిల్ (39 వికెట్లు, 2022), శ్రీలంక స్పిన్నర్ వనిందు హసరంగ (38 వికెట్లు, 2024) అతని కంటే ముందున్నారు.

# 'కాంతార' బ్యూటీ ఎమోషనల్ పోస్ట్!



హైదరాబాద్, అక్టోబర్ 24 : కన్నడ యువ నటి రుక్మిణి వసంత్ వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతున్నారు. ముఖ్యంగా 'కాంతార: చాప్టర్ 1'లో అవకాశం దక్కించుకున్న తర్వాత దక్షిణాది చిత్ర పరిశ్రమలో ఆమెకు క్రేజ్ విపరీతంగా పెరిగింది. ఈ క్రమంలోనే తాజాగా ఆమె ఒక కొత్త చిత్రంలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 'ఒకే ఒక జీవితం' ఫేమ్ శ్రీ కార్తీక్ ఈ చిత్రంలో నటిస్తూ దర్శకత్వం వహిస్తుండగా, ఈ సినిమాకు సంబంధించి అధికారిక ప్రకటన వెలువడింది. ఈ కొత్త ప్రాజెక్ట్ గురించి రుక్మిణి వసంత్ సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగపూరితమైన పోస్ట్‌ను పంచుకున్నారు. "తొలిసారి కథ విన్నప్పటి నుంచే ఈ సినిమాపై మా బృందంలో ఎంతో ఉత్సాహం నెలకొంది. సెట్‌లోకి అడుగుపెట్టే ప్రతి క్షణం ఎంతో ఉత్కంఠగా అనిపించింది. ఈ సానుకూల వాతావరణం నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తోంది" అని ఆమె పేర్కొన్నారు. ఈ చిత్రంలో ఆమె 'తార' అనే ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. మ్యాడ్ బాయ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్, సిరుణి సినీ కార్పొరేషన్స్ సంయుక్త నిర్మాణంలో వస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన పవర్‌ఫుల్ టైటిల్‌ను త్వరలోనే ప్రకటించనున్నారు.







# కరీంనగర్ మట్టిలో 'శనార్తి' సందడి..

## మొదలైన సినిమా షూటింగ్!

**కరీంనగర్, అక్టోబర్ 24 :** టాలీవుడ్‌లో పక్కా లోకల్, రా అండ్ రస్టిక్ కథలతో తనదైన ముద్ర వేసిన ప్రముఖ దర్శకుడు, నిర్మాత సంపత్ నంది మరో అదిరిపోయే ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. సోషల్ మీడియాలో విపరీతమైన ఫాలోయింగ్ ఉన్న 'రాజ్ వెడ్స్ రాంబాయ్' ఫేమ్ అఖిల్ రాజ్, 'ఫోక్ క్వీన్' నాగదుర్గలను హీరోహీరోయిన్లుగా పరిచయం చేస్తూ తెరకెక్కిస్తున్న సరికొత్త చిత్రం 'శనార్తి' రెగ్యులర్ షూటింగ్ కరీంనగర్ జిల్లాలో గ్రాండ్‌గా ప్రారంభమైంది. ఆదిత్య మూవీస్ సమర్పణలో సంపత్ నంది టీమ్ వర్క్స్, శ్రీ ధనలక్ష్మి ప్రొడక్షన్స్ బ్యానర్లపై కే.వి. శ్రీధర్ రెడ్డి, సంపత్ నంది సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కరీంనగర్ జిల్లా వెలిచాలలో డైరెక్టర్ సంపత్ నంది, ప్రొడ్యూసర్ శ్రీధర్ రెడ్డి సమక్షంలో ఈ సినిమా పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న గణేష్ రాజ్ ఉప్పునూటి స్వస్థలం కరీంనగర్ జిల్లాలోని గట్టు బూత్కూర్ కావడం విశేషం. ఒక యువ దర్శకుడు తన తొలి సినిమాను సొంత ఊరి వాతావరణంలోనే సుమారు నెల రోజుల పాటు చిత్రీకరిస్తున్నారు. తెలంగాణ సంప్రదాయాలు, మట్టి వాసనలను వెండితెరపైకి తీసుకురాబోతున్న ఈ చిత్రానికి సురేష్ బొబ్బిలి సంగీతం అందిస్తుండగా, విశ్వనాథ్ రెడ్డి సినిమాటోగ్రఫీ, బేబీ సురేష్ భీమగాని ఆర్ట్ డైరెక్షన్‌గా వ్యవహరిస్తున్నారు. మై విలేజ్ షో రాజు, మురళీధర్ గౌడ్, సునందిని, సుంకర లక్ష్మి, రమేష్ నకిరికంటి, వైవా రెడ్డి, అంజి బాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.



# టాలీవుడ్‌లోకి 'సైయారా' బ్యూటీ ఎంట్రీ?

**హైదరాబాద్, అక్టోబర్ 24 :** మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న క్రేజీ ప్రాజెక్ట్ 'ఆర్సీ17'పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ సినిమా ఇంకా అధికారికంగా ప్రారంభం కాకముందే సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వైరల్ అవుతున్నాయి. ఇప్పటికే సంగీత దర్శకుడిగా అనిరుద్ ఖరారవ్వగా, తాజాగా హీరోయిన్ ఎంపిక అంశం చర్చనీయాంశంగా మారింది. చరణ్‌కు జోడీగా బాలీవుడ్ భామను తీసుకోవాలని భావిస్తున్న సుకుమార్.. ఈ క్రమంలో తాజాగా 'సైయారా' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న యువ హీరోయిన్ అనీత్ పడ్డా పేరు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. బాలీవుడ్‌లో 'సైయారా' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న అనీత్ పడ్డా.. ఇటీవల హైదరాబాద్‌లో ప్రత్యక్షం కావడంతో ఈ ఊహాగానాలు మరింత ఊపందుకున్నాయి. ఆమె ఈ ప్రాజెక్ట్ కోసమే నగరానికి వచ్చారంటూ అభిమానులు చర్చించుకుంటున్నారు. గతంలో కియారా అద్వానీ, సారా అర్జున్ పేర్లు వినిపించగా, ఇప్పుడు అనీత్ పేరు తెరపైకి వచ్చింది. ఇదిలాఉంటే, 'ఆర్సీ17' సినిమా పూజా కార్యక్రమాలను అక్టోబర్ 26 లేదా 27 తేదీల్లో నిర్వహించనున్నట్లు నిర్మాత మైత్రి రవి ఇటీవల వెల్లడించిన నేపథ్యంలో.. చిత్రంలో నటించే హీరోయిన్పై త్వరలోనే అధికారిక స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



# ఎయిర్‌పోర్ట్‌లో చుట్టుముట్టి తాకారు

## నటి అనుపమ పరమేశ్వరన్ ఆవేదన!

**హైదరాబాద్, అక్టోబర్ 24:**

ప్రముఖ నటి అనుపమ పరమేశ్వరన్ తనకు ఎయిర్‌పోర్ట్‌లో ఎదురైన ఓ చేదు అనుభవాన్ని తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో పంచుకున్నారు. కొందరు వ్యక్తులు తనను చుట్టుముట్టి, అనుమతి లేకుండా ఫొటోలు తీయడమే కాకుండా అసభ్యంగా తాకారంటూ ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను మానసికంగా ఎంతో ఇబ్బంది పెట్టిందని తెలిపారు. ఇటీవల ఓ ఎయిర్‌పోర్ట్‌లో లగేజీ కోసం ఒంటరిగా వేచి చూస్తున్న సమయంలో ఈ సంఘటన జరిగిందని అనుపమ వివరించారు. క్షణాల్లో జనం తనను చుట్టుముట్టి హద్దులు మీరారని, ఆ సమయంలో ఏం చేయాలో పాలుపోలేదని పేర్కొన్నారు. అభిమానులతో ఫొటోలు దిగడానికి ఎలాంటి అభ్యంతరం లేదని, కానీ కొందరు ప్రవర్తించే తీరు తీవ్ర ఆందోళన కలిగిస్తోందని స్పష్టం చేశారు. సమాజంలో సాధారణ మహిళలు కూడా నిత్యం ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి ధైర్యాన్ని మెచ్చుకోవాలని అనుపమ అభిప్రాయపడ్డారు.

# దీపికా పదుకొణే.. బ్యాక్ టు షూట్!



**ముంబై, అక్టోబర్ 24:** బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణే మరోసారి కెమెరా ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. రెండోసారి తల్లి అయిన తర్వాత కొంతకాలం సినిమాలకు దూరంగా ఉన్న ఈ స్టార్ బ్యూటీ.. ఇప్పుడు తన పెండింగ్ షూటింగ్స్‌ను పూర్తి చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. షారుఖ్ ఖాన్ నటిస్తున్న 'కింగ్', అల్లు అర్జున్ నటిస్తున్న 'రాకా' సినిమాల్లో తనకు సంబంధించిన సన్నివేశాలను ఆమె పూర్తి చేయనున్నారు. ప్రెగ్నెన్సీ సమయంలోనూ షూటింగ్స్‌లో పాల్గొన్న దీపికా.. డెలివరీ సమయం దగ్గరపడటంతో కొంతకాలం విరామం తీసుకున్నారు. ఇటీవల మరో పాపకు జన్మనిచ్చిన ఆమె, ప్రస్తుతం మాతృత్వాన్ని ఆస్వాదిస్తూనే మళ్లీ సినిమాలపై దృష్టి పెట్టారు. అక్టోబర్ 26 నుంచి షారుఖ్ ఖాన్ 'కింగ్' సినిమా షూటింగ్‌లో దీపిక పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఈ షెడ్యూల్‌లో భాగంగా ముంబైలో ఓ పాటను చిత్రీకరించనుండగా, ప్రముఖ కొరియోగ్రాఫర్ వైభవి మర్చంట్ ఈ సాంగ్‌కు కొరియోగ్రఫీ చేయనున్నారు. మొదట ఈ పాటను దక్షిణాఫ్రికాలో తీయాలని భావించినప్పటికీ, దీపికా కాల్షీట్స్‌ను దృష్టిలో పెట్టుకుని లొకేషన్‌ను ముంబైకి మార్చినట్లు సమాచారం. 'కింగ్' పూర్తయ్యాక 'రాకా' సెట్స్‌లోకి ఆమె అడుగుపెట్టనున్నారు.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**